ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శనివారం 5 జూలై 2025 | 5



99 మందికి పీహెచ్‌డీలు

స్నాతకోత్సవ వేడుకల్లో భాగంగా 99 మంది రీసెర్చ్ స్కాలర్స్‌కు పీహెచ్‌డీలు, 35 మందికి బంగారు పతకాలు, ఐదుగురికి ఎండోమెంట్ అవార్డులను గవర్నర్, వీసీ ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వర్సిటీ రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఆదిత్య చైర్మన్ ఎన్.శేషారెడ్డి, ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ పి.ఉదయ్‌భాస్కర్, మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు, కేవీఎస్‌జీ మురళీకృష్ణ, శ్రీనివాస్‌కుమార్, ఈసీ సభ్యులు బీవీవీ సత్యనారాయణ, అమీనాబీ, హరిత, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యా.. విజయం



అదిరే..అదిరే : స్నాతకోత్సవంలో విద్యార్థిని సాంస్కృతిక ప్రదర్శన



స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్



గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో జేఎన్‌టీయూకే వీసీ తదితరులు..



నువ్వే సాధించావ్ తల్లి..



జేఎన్‌టీయూకే విద్యార్థులకు పట్టాభిషేకం

గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న కోట సుబ్రహ్మణ్యం

- విద్యతో దేన్నయినా సాధించవచ్చు
- క్వాంటమ్ మిషన్‌తో ఉపాధి
- గవర్నర్, వర్సిటీ కులపతి అబ్దుల్ నజీర్
- జేఎన్‌టీయూకే 11వ స్నాతకోత్సవం

జేఎన్టీయూకే, జూలై4(ఆంధ్రజ్యోతి): యువత ధైర్యంగా, విభిన్నంగా ఆలోచిస్తూ సమస్యలను ఎదుర్కొని విజయం సాధించాలని రాష్ట్ర గవర్నర్, వర్సిటీ కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. కాకినాడ జేఎన్టీయూ 11వ స్నాతకోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది.వర్సిటీలోని అలూమ్నీ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ అధ్యక్షత వహించి అధ్యక్షోపన్యాసం చేశారు. విద్య అనేది ప్రతి ఒక్కరికీ అవసరమైందని, విద్యతో ప్రపంచంలో దేన్నయినా సాధించవచ్చన్నారు. రాష్ట్రంలో ఏర్పాటవుతున్న క్వాంటమ్ మిషన్ వల్ల 2026 నాటికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయాలు క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీ, ఏఐ, ఐవోటీ, రోబోటిక్స్, నానోటెక్నాలజీ, తాత్విక ఆలోచనలతో సాంకేతికతను ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. స్వర్ణాంధ్రప్రదేశ్-2027 విజన్ ద్వారా మన రాష్ట్రం డిజిటల్ పరిపాలన, స్టార్టప్స్, తీరప్రాంతాల ఆధునీకరణతో ప్రపంచాన్ని తలదన్నే మౌలిక సదుపాయాల కల్పనలో దూసుకువెళుతుందని చెప్పారు.ఇక్కడే చదువుకుని..అమెరికాలోని బోస్టన్ గ్రూప్ చైర్మన్‌గా ఉన్న కోట సుబ్రహ్మణ్యం (సుబు కోట)కు గవర్నర్ అబ్దుల్ నజీర్ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. అనంతరం కోట సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ స్టార్టప్స్ కోసం ఏర్పాటయ్యే ఇంక్యుబేషన్ సెల్స్ విశిష్టతను తెలిపారు. భారతదేశంలో ప్రతీ ఏడాది 25 లక్షల మంది గ్రాడ్యుయేట్లు, 3.5 లక్షల మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు డిగ్రీ పట్టాలతో బయటకు వస్తున్నారన్నారు. చైనాతో పోలిస్తే భారత్‌లో గ్రాడ్యుయేట్లు 1.5 రెట్లు ఎక్కువని, అమెరికాతో పోలిస్తే 2 రెట్లు ఎక్కువని తెలిపారు. భారతదేశంలో విద్యా నాణ్యత ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. సీఎస్ఈలో భారత్‌లో ప్రతి ఏడాది సుమారుగా 25 మంది మాత్రమే పీహెచ్‌డీలు అందుకుంటున్నారని, అమెరికాలో ఏడాదికి 800 మంది కంటే ఎక్కువగా ఉన్నారని తెలిపారు. జేఎన్టీయూకే ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ పరిశోధన కోసం నూతన కోణాలను అవలంభించాలని, సమాజశ్రేయస్సు కోసం పరిశోధనా ప్రాజెక్టులను చేపట్టాలని విద్యార్థులకు సూచించారు. పరిశ్రమ, విశ్వవిద్యాలయాలకు అనుసంధానంగా పాఠ్యాంశాలు, కోర్సు రూపకల్పనలతో పాటు పరిశ్రమల్లో పరిశోధనలను జాతీయ విద్యావిధానం ప్రోత్సహిస్తుందన్నారు. తర్వాత గవర్నర్ అబ్దుల్‌నజీర్‌ను వీసీ సత్కరించారు. వర్సిటీ రెక్టార్ కేవీ రమణ స్నాతకోత్సవానికి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వర్సిటీ రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, రాజ్ భవన్ అధికారులు, ఆదిత్య చైర్మన్ ఎన్.శేషారెడ్డి, ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ పి.ఉదయ్‌భాస్కర్, మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు, కేవీఎస్‌జీ మురళీకృష్ణ, శ్రీనివాస్‌కుమార్, ఈసీ సభ్యులు బీవీవీ సత్యనారాయణ, అమీనాబీ, హరిత, రత్నకుమారి, డైరెక్టర్లు గోపాలకృష్ణ, బీటీకృష్ణ, కృష్ణప్రసాద్, పద్మజారాణి, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, శ్యామ్‌కుమార్, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆకాశమే హద్దు : జేఎన్‌టీయూకే స్నాతకోత్సవంలో భాగంగా పట్టాలు అందుకున్న అనంతరం విద్యార్థుల ఆనందం

డీఎస్‌వోగా పార్వతి



రాజమహేంద్రవరం అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లా పౌరసరఫరాల అధికారిణిగా వి.పార్వతి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. మచిలీపట్నం డీఎస్‌వో కార్యాలయంలో సహాయ పౌరసరఫరాల అధికారిగా పనిచేస్తున్న పార్వతి పదోన్నతిపై జిల్లాకు బదిలీ అయ్యారు. ఈమేరకు కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్నరాముడులను కలిసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అధికారులు

పీ4పై సీఎం సమీక్ష

రాజమహేంద్రవరం సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : దిగువ స్థాయిలో ఉన్న కుటుంబాలకు పురోగతి పీ4 లక్ష్యమని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రభుత్వ ప్రైవేట్ ప్రజల భాగస్వామ్యం (పీ4) కార్యక్రమంపై సీఎం నారా చంద్రబాబు నాయుడు జిల్లా అధికారులతో శుక్రవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ ప్రశాంతి జిల్లా ప్రగతిని సీఎంకు వివరించారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. పీ4 కార్యక్రమంలో మండలాల వారీగా గ్రామాల్లో 10 శాతం మార్గదర్శకులను దిగువ స్థాయిలో ఉన్న 20 శాతం బంగారు కుటుంబాలను ఎంపిక చేసుకుని వారికి పీ4 ముఖ్యోద్దేశం వివరించాలన్నారు. ఈ సమీక్షలో జేసీ ఎస్.చిన్నరాముడు, డీఆర్‌వో టి.సీతారామమూర్తి, సీపీవో అప్పల కొండ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం.. బాలిక మృతి 7



విద్యుత్ శాఖ నిర్లక్ష్యం.. కొవ్వూరుకు చెందిన బాలిక నిండు ప్రాణాలు తీసింది.. చాలా కాలంగా కిందకు వేలాడుతున్న విద్యుత్ వైరు తొలగించమని కోరినా.. నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బాలిక విద్యుదాఘాతానికి గురై మృతిచెందిందని బంధువులు ఆందోళనకు దిగారు..

పక్కాగా.. స్కెచ్!

ఒక సర్వేయర్ గలీజు పని!



- వ్యాపారుల మధ్య తీవ్ర పోటీ
- మైనింగ్ స్కెచ్‌ల విక్రయం
- రూ.3 లక్షల చొప్పున వసూలు
- అరకోటికిపైగా గుంజుడు
- లక్షల్లో ముట్టజెబితే స్కెచ్‌లు
- మిగిలినవారికి జెల్ల
- 53 దరఖాస్తులు
- ఒక్క రౌతులపూడికే 45

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

గనులశాఖలో చిన్న తరహా ఖనిజాలు దక్కించుకునేందుకు ఉమ్మడి జిల్లాలో నెలకొన్న భారీ పోటీ ఆ సర్వేయర్‌కు లక్షల్లో కాసుల వర్షం కురిపించింది. ఫస్ట్ కం ఫస్ట్ విధానంలో ముందుగా మైనింగ్‌కు దరఖాస్తు చేసుకున్నవారికే లీజు దక్కనుండడంతో సదరు ఉద్యోగి ఇదే అదనుగా స్కెచ్‌లకు బేరం పెట్టేశాడు. దరఖాస్తుకు తోడు మైనింగ్ స్కెచ్ పక్కాగా ఉంటేనే లీజు దక్కనుండడాన్ని అనరాగా చేసుకుని భారీగా పిండేశాడు. ఉచితంగా ఇవ్వాల్సిన మైనింగ్ స్కెచ్‌లకు హెక్టారుకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేశాడు. ఇలా మూడు రోజుల వ్యవధిలో సదరు సర్వేయర్ అర కోటికిపైగానే జేబులో వేసేసుకున్నాడు.ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మైనింగ్ లీజులకు 53 దరఖాస్తులు రాగా 45 ఒక్క రౌతులపూడిలో క్వారీలకే వచ్చాయి. ఇందులో సదరు సర్వేయర్ తనకు భారీగా ముట్టజెప్పిన రెండు కంపెనీలకు 15 దరఖాస్తులు దఖలు చేయించడం విశేషం.

తొలుత వచ్చిన వారికే..

గత వైసీపీ హయాంలో కుదేలైన మైనింగ్ రంగానికి పునర్జీవం కల్పించేలా ఈ ఏప్రిల్‌లో రాష్ట్ర ప్రభుత్వం మినరల్ పాలసీ-2025 తెచ్చింది. ఖనిజ నిబంధనలు సవరిస్తూ కిందటి గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం మైనింగ్ లీజులకు ఎవరు ముందు దరఖాస్తు చేసుకుంటే వారికే గనులు కేటాయించేలా ప్రభుత్వం నిర్ణయించింది. ఫస్ట్ కం ఫస్ట్ అప్లికేషన్ విధానం అమల్లోకి తెచ్చింది.ఈ నేపథ్యంలో గత నెల 30 నుంచి ఈ నెల 12 తేదీల్లో అనేక మంది మైనింగ్ వ్యాపారులు క్వారీల్లో నల్లరాయికి పోటీ పడ్డారు. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోటీ తీవ్రంగా నెలకొంది. మైనింగ్ స్కెచ్ పక్కాగా ఉంటేనే లీజు మంజూరవుతుంది. గనులశాఖ ఈ స్కెచ్‌లను దరఖాస్తుదారులకు ఉచితంగా ఇవ్వాలి.ఎందు కంటే లీజుదారుడు దరఖాస్తు సమయంలోనే హెక్టారు మైనింగ్ తవ్వకానికి రూ.80 వేలు చొప్పున చెల్లిస్తాడు.రూ.5 వేలు సర్వే ఫీజు కట్టాలి.

రౌతులపూడికే డిమాండ్..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 53 మైనింగ్ దరఖాస్తులు ఆన్‌లైన్‌లో రాగా ఇందులో 45 దరఖాస్తులు ఒక్క రౌతులపూడిలోని నల్లరాతి క్వారీలకే దాఖలయ్యాయి. మిగిలినవి పెద్దాపురం గ్రావెల్, జెడ్.అన్నవరం, వాలుతిమ్మాపురం ప్రాంతాలకు దాఖలయ్యాయి. రౌతులపూడిలోని వందల హెక్టార్లలో క్వారీలకు 45 దరఖాస్తులు పడ్డాయి.

పక్కాగా స్కెచ్‌వేసి కొట్టేశాడు..

ఉమ్మడి జిల్లాలో కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోని గనుల శాఖ కార్యాలయాల్లో సర్వేయర్ల వద్ద మైనింగ్ స్కెచ్‌లు అందుబాటులో ఉంటాయి. లీజుదారులు వీటిని దక్కించు కునేందుకు ప్రయత్నించారు. అయితే ఖనిజ నిబంధనలు విడుదలవడానికి కొన్ని రోజుల ముందే తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గనుల శాఖ సర్వేయర్ వీటిపై కన్నేశాడు. ఈయన పదిహేనేళ్ల నుంచీ ఇక్కడే పాతుకు పోయాడు. కాకినాడ సర్వేయరేమో జూనియర్. కాకినాడ కార్యాలయంలో ఉన్న స్కెచ్‌లన్నీ అవసరం పేరుతో సదరు రాజమహేంద్రవరం గనులశాఖ సర్వేయర్ ముందే రప్పించేశాడు. గనులశాఖ అనుమతించిన ప్రైవేటు సర్వేయర్ల వద్ద స్కెచ్‌లను పరిశీలన పేరుతో ముందుగానే రప్పించుకున్నాడు.ఆ తర్వాత ఇక్కడి నుంచే కథ నడిపాడు. స్కెచ్‌లను హెక్టారుకు రూ.3 లక్షల వరకు సదరు సర్వేయర్ విక్రయించాడు. కొందరు వ్యాపారులు 5, 10, 15 హెక్టార్లకు అప్లికేషన్లు దాఖలు చేయగా ఈ పెద్ద స్కెచ్‌లకు రూ.10 లక్షల వరకు డబ్బులు గుంజేశాడు. రౌతులపూడి క్వారీలకు డిమాండ్ ఉండడంతో సుమారు 60 క్వారీల స్కెచ్‌లు తన వద్దే ఉంచుకున్నాడు. స్కెచ్ ఉన్న దరఖాస్తుదారుడికి లీజు అవకాశాలు పుష్కలంగా ఉండడంతో అనేక మంది వ్యాపారులు వీటిని సదరు సర్వేయర్ వద్ద కొనుగోలు చేశారు.రవి అనే వ్యాపారి సత్య ఇంజనీరింగ్ పేరుతో పలు పేర్లు మార్చి ఏడు దరఖాస్తులు దాఖలు చేశారు.ఈ మైనింగ్ ప్రాంతం స్కెచ్‌లన్నీ ఈయన ముందే కొనేశాడు. సదరు సర్వేయర్ అడ్డంగా సహకరించాడు. రౌతులపూడి క్వారీకి సంబంధించి దాదాపు 28 మంది వ్యాపారులు లక్షలకు లక్షలు సర్వేయరుకు ముట్టజెప్పారు. మెట్ట ప్రాంతానికి చెందిన ఓ కాంట్రాక్టర్ కంపెనీ ఆరు దరఖాస్తులు చేయగా స్కెచ్‌లకు భారీగా ముట్టజెప్పింది. సదరు ఉద్యోగి మూడు రోజుల వ్యవధిలో అర కోటిపైనే జేబు నింపేసుకున్నాడు. కాకినాడ సర్వేయర్ జూనియర్ కావడం రాజమహేంద్రవరం ఏడీ కార్యాలయ సర్వేయర్‌కు బాగా కలిసొచ్చింది.

ఇక్కడా వైసీపీ నేతలే..!

అప్లికేషన్ ఆన్‌లైన్‌లో దాఖలు చేయడానికి సమయం పట్టడం, కొత్త వ్యాపారులకు అవగాహన లేకపోవడంతో సదరు సర్వేయర్ ఏకంగా ఎనిమిది మందిని పురమాయించి రాజమహేంద్రవరంలో ఓ అపార్ట్‌మెంట్ నుంచి వంద హెక్టార్ల మైనింగ్ కోసం వ్యాపారుల తరపున 15 లీజు దరఖాస్తులు చేయించారు.కాకినాడ గనుల శాఖలో అవుట్‌సోర్సింగ్ మాజీ మహిళా ఉద్యోగి సైతం కొందరు వ్యాపారుల తరపున దరఖాస్తులు దాఖలు చేశారు.ఇదిలా ఉంటే వచ్చిన దరఖాస్తులను సోమవారం నుంచి పరిశీలించి ఎవరు ముందుగా లీజులకు దరఖాస్తు చేశారు? స్కెచ్‌లు ఎవరివి పక్కాగా ఉన్నాయో నిర్ధారించి లీజులు ఖరారు చేయనున్నారు.దరఖాస్తుల్లో అనేక మంది వైసీపీ వ్యాపారులు ఉండడంతో లీజుల కోసం వీరు సైతం చక్రం తిప్పుతున్నారు.



అమల్లోకి మైనింగ్ కొత్త పాలసీ

14 వరకే సీనరేజి కాంట్రాక్టు గడువు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం మైనర్ మినరల్ పాలసీ, ఇసుక ఉచిత విధానంతో కొత్త మైనింగ్ పాలసీని అమల్లోకి తెచ్చింది. ఈ మేరకు గత నెల 26వ తేదీనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గెజిట్‌లో నోటిఫికేషన్ విడుదల చేశారు. దీంతో జిల్లాలో చాలా కాలం తర్వాత మైనింగ్ సందడి మొదలైంది. మాన్యువల్‌గానే ఇసుక తీయాలని కొత్త పాలసీలో ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం డీసిల్టేషన్‌కే అనుమతి ఉందని.. ఓపెన్ రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. గత వైసీపీ పాలనలో మైనింగ్ విధానం ధ్వంసమైన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఏప్రిల్ 29న కొత్తపాలసీపై ప్రభుత్వం ఓ సర్క్యులర్ జారీ చేసిన సంగతి తెలిసిందే. దానిని అధికారికంగా అమల్లోకి తెచ్చారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బిల్డింగ్,రోడ్ మెటల్, గ్రానైట్,గ్రావెల్, లేటరైట్ గనులు ఉన్నాయి. అప్పట్లో 250 లీజు దరఖాస్తులను వైసీపీ పెండింగ్‌లో పెట్టింది. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వాటిని పరిశీలించి అర్హులకు లీజు ఇవ్వనుంది. కొత్త దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ముందు పాతవి క్లియర్ చేయనున్నారు. ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ) ప్రకారం 2023 మార్చి 13 నాటికి ఫైలైన పెండింగ్ మినరల్ కన్సెషన్ దరఖాస్తులు పరిశీలించి పరిష్కరించనున్నారు. అర్హత ఉంటే ఆమోదం తెలిపి డిపాజిట్ కట్టించుకుంటారు.గ్రానైట్, మార్బుల్, బిల్డింగ్ మెటీరియల్‌కు తాజాగా దరఖాస్తు చేసుకోవాలి. ఇండస్ట్రియల్ మినరల్ కోసం వేలం పద్ధతి ఉంటుంది. దరఖాస్తులన్నీ ఆన్‌లైన్‌లో జరుగుతాయి. రోడ్ మెటల్ హెక్టారుకు రూ.80 వేలు, గ్రావెల్‌కు రూ. 65 వేలు, గ్రానైట్‌కు రూ. లక్షా 85 వేల వరకూ డిపాజిట్ చేయవలసి ఉంది.

14 వరకూ సీనరేజి కాంట్రాక్టు

సీనరేజి కాంట్రాక్టు గడువు ఈ నెల 14వ తేదీ తేదీ వరకూ ఉంది. గతంలో మైనింగ్ అధికారులే సీనరేజి వసూలు చేసేవారు.కానీ వైసీపీ ప్రైవేట్ కాం ట్రాక్టరుతో ముందుగానే డిపాజిట్ కట్టించు కుని సీనరేజీ వసూళ్లను అప్పగించింది.ఇది చాలా మందికి ఇబ్బంది కరంగా మారింది.మరి ప్రభుత్వం ఈ నెల 14వ తేదీ తర్వాత ఏం చేస్తుందో చూడాలి.

మూగనోము వీడిన పోలీస్

- 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదలిక
- ప్రత్యేక దృష్టి పెట్టిన ఎస్పీ
- గేదెల దొంగలపై నిఘా

రాజానగరం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : గేదెల దొంగతనాలపై ఎట్టకేలకు పోలీసులు కదిలారు.ఆంధ్రజ్యోతిలో శుక్రవారం 'పోలీసుల మూగనోము' శీర్షికతో వెలువడిన కథనంపై స్పందించారు. జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ నేరుగా రంగంలోకి దిగారు. ఎస్పీ ఆదేశాల మేరకు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు శుక్రవారం చక్రద్వారబంధం గ్రామానికి చేరుకుని బాధిత పాడి రైతులు, యజమానులను కలిసి వివరాలు సేకరించే చర్యలకు ఉపక్రమించారు. రాజానగరం మండలంలో గత కొన్నేళ్లుగా పాడి పశువుల వరుస దొంగతనాలపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో బాధిత రైతులు, యజమానులు ఆంధ్రజ్యోతిని ఆశ్రయించిన విషయం విదితమే. పత్రికలో వచ్చిన విధంగా స్పెషల్ బ్రాంచ్ పోలీసులు బాధిత యజమానులు, రైతులను స్వయంగా కలిసి ఎప్పుడు జరిగింది, ఎలా జరిగింది, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారా? ఎఫ్ఐఆర్ నమోదు చేశారా? చేస్తే రశీదు ఇచ్చారా లేదా అనే వివరాలను సేకరించారు. పశువుల దొంగతనాలపై గత కొన్నేళ్లుగా రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఆంధ్రజ్యోతిని ఆశ్రయించినట్టు రైతులు తెలిపారు. పశువుల దొంగతనాలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ రాజానగరం పోలీసులకు ఆదేశాలిచ్చారు.

మహిళ హత్యకేసులో ముగ్గురికి యావజ్జీవం 5

చెడు వ్యసనాలకు బానిసలై..చోరీలు! 7

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె

మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె నోటీసు

కొవ్వూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులు హెచ్చరించారు. కొవ్వూరు మునిసిపల్ కమిషనర్ (ఎఫ్ఏసీ) సందీప్‌కు శుక్రవారం ముందస్తుగా సమ్మె నోటీసు అందజేశారు.ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ముఖ్య సలహాదారుడు పెదపాటి గురునాథ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీల్లో అత్య వసర విభాగాలైన ఇంజనీరింగ్, నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, డేటాఎంట్రీ ఆపరేటర్లు, వర్కు ఇన్‌స్పెక్టర్లకు నెల సరి వేతనం రూ.29,200లు ఇంజనీరింగ్ డ్రైవర్లు, క్యాబ్‌డ్రైవర్లకు రూ. 24,500ల వేతనాలు పెంపుదల చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఔట్ సోర్సింగ్ కార్మికులకు అర్హత కల్పించాలని డిమాండు చేశారు. ఈ నెల 15వ తేదీలోగా సమస్యలు పరిష్కరించకపోతే నేరుగా సమ్మెలోకి దిగుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రాజాన అప్పారావు,సీఐటీయూ నాయకులు ఎం.సుందర బాబు, ఎం.కిశోర్, నాగేశ్వరరావు, సోములు తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు కమిషనర్ సందీప్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

'పంటల బీమా నమోదు చేయించండి'

రాజమహేంద్రవరం రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పంటల బీమా నమోదు చేసు కోవాలని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ రికార్డుల ఏకీకరణతో నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ లో నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలో సార్వా 2025 పంటల బీమా క్రింద నోటిఫై చేసిన ప్రీమీయం వరి రూ.570 ఆగస్టు 15 లోగా, మినములు రూ.300 జూలై 15వ తేదీ లోగా, అరటి రూ.3 వేలు జూలై 15వ తేదీలోగా చెల్లించాలన్నారు. రుణం పొందిన రైతులకు బ్యాంకు ద్వారా పంటల బీమా నమోదవుతుందన్నారు. రుణం పొందని రైతులు కామన్ సర్వీస్ సెంటరుకు వెళ్లి నమోదు చేయిం చుకోవాలన్నారు.కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం పంటల బీమా యోజన నమోదు గోడపత్రిను కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, ఎస్‌బీఐ బ్యాం క్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



పంటల బీమా నమోదు పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, అధికారులు

కనుల పండువగా స్నాతకోత్సవం

కాకినాడ నగరంలో ఉన్న జేఎన్‌టీయూకే 11వ స్నాతకోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు రాష్ట్ర గవర్నర్, వర్సిటీ కులపతి ఎస్ అబ్దుల్ నజీర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఇదే కళాశాల పూర్వపు విద్యార్థి, అమెరికాలోని బోస్టన్ గ్రూప్ చైర్మన్ కోట సుబ్రహ్మణ్యానికి గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. అలాగే 99 మంది రీసెర్చ్ స్కాలర్స్‌కు పీహెచ్‌డీ అవార్డులు, 35 మందికి బంగారు పతకాలు, ఐదుగురికి ఎండోమెంట్ అవార్డులను అందజేశారు. గంటకుపైగా సాగిన ఈ కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది.









కాకినాడలో శుక్రవారం జరిగిన జేఎన్‌టీయూకే స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి బంగారు (పసుపు) పతకాలు, పీహెచ్‌డీ పట్టాలు (తెలుపు గౌను) అందుకుంటున్న దృశ్యం

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

స్నాతకోత్సవం సందర్భంగా జేఎన్‌టీయూకే లోని అలూమ్నీ ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. క్యాంపస్ కళాశాలలోని విద్యార్థులు నిర్వహించిన పలు సంప్రదాయాలకు చెందిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.







జేఎన్‌టీయూకే స్నాతకోత్సవంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఈ విజయం అమ్మలది కూడా..





బంగారు పతకాలు పొందిన తర్వాత తమ తల్లులతో ఆనందాన్ని పంచుకుంటున్న విద్యార్థినులు.. తన తల్లితో ఓ విద్యార్థి



స్నాతకోత్సవంలో కులపతి నజీర్‌కు జ్ఞాపిక అందిస్తున్న వర్సిటీ ఉపకులపతి సీఎస్‌ఆర్‌కే ప్రసాద్

పీహెచ్‌డీలు, బంగారు పతకాలు ప్రదానం

జేఎన్టీయూకే, జూలై 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ 11వ స్నాతకోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కొందరు పీహెచ్‌డీలు, బంగారుపతకాలు అందుకున్నారు. వారిలో కొందరి అభిప్రాయాలు ఇలా ఉన్నాయి....

• బంగారు పతకాలు



మార్కులకోసం చదవకూడదు

విద్యార్థులు మార్కులకోసం కాకుండా సబ్జెక్టుపరంగా చదివితే విజయం సాధించవచ్చు. సీఎస్‌ఈలో బంగారు పతకం సాధించడం చాలా సంతోషంగా ఉంది. సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించడమే నా లక్ష్యం.

- కలిశెట్టి పావని, బంగారుపతకం



స్టార్టప్ ప్రారంభించడమే లక్ష్యం

సీఎస్‌ఈ ఏఐలో టాపర్‌గా నిలిచి బంగారుపతకం సాధించాను. స్టార్టప్ కంపెనీ ప్రారంభించి ఉన్నత స్థానంలోకి చేరుకోవడమే నా లక్ష్యం.

- షేక్ సులేమాన్, బంగారు పతకం



ఎంటర్‌ప్రెన్యూర్ కావడమే నా కోరిక

వర్సిటీ అనుబంధ కళాశాలల పరిధిలో 9.08 సీజీపీఏ పాయింట్లతో సీఎస్‌ఈ (ఎంఈ)లో టాపర్‌గా నిలిచి, అల్లం అప్పారావు బంగారు పతకాన్ని, సీఎస్‌ఈలో టాపర్‌గానూ మొత్తం 3 పతకాలు సాధించాను. ప్రస్తుతం శాప్‌లో పనిచేస్తున్నాను.

- జె.విశాలసుబ్బలక్ష్మి, బంగారు పతకం

• పీహెచ్‌డీ అవార్డులు



ఈసీఈలో పరిశోధన

అక్యులర్ ఆర్టిఫిక్స్‌లో పరిశోధన చేశాను. ఈఈజీలో అవాంతరాలు ఏర్పడినప్పుడు ఎంఎల్ ఆల్గోరిథం ద్వారా ఏవిధంగా వాటిని నియంత్రించవచ్చో కనుగొన్నాను.

- డి.శ్యామ్‌ప్రసాద్, పీహెచ్‌డీ



నూతనమందులను కనుగొనవచ్చు

బయోఇన్ఫర్మేటిక్స్‌లో ప్రొటీన్ నిర్మాణం, ప్రెడిక్షన్ ద్వారా నూతన మందులను కనుగొనే విధానాన్ని కనిపెట్టాను. దీంతో నూతన పద్ధతిలో మందులను కనుగొనవచ్చు.

- డాక్టర్ టి.సుధారాణి, పీహెచ్‌డీ




డేటా పొందాలంటే అనుమతి తప్పనిసరి

క్లౌడ్ కంప్యూటింగ్ సెక్యూరిటీలో ఉన్న డేటాను పొందాలంటే దానిని క్రియేట్ చేసిన వ్యక్తినుంచి తప్పనిసరిగా అనుమతి పొందాలి. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నాను.

- ఈ.రవికుమార్, పీహెచ్‌డీ

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

రెండో షెడ్యూల్‌లో ఎన్సీ 24




నాగచైతన్య కథానాయకుడిగా కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ చిత్రం (ఎన్సీ-24- వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోంది. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. శుక్రవారం హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్‌ను ప్రారంభించినట్లు యూనిట్ తెలిపింది. నెలరోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో నాగచైతన్యతో పాటు ప్రధాన తారాగణం అంతా పాల్గొంటోంది. ఈ సందర్భంగా యూనిట్ నాగచైతన్య పోస్టర్‌ను విడుదల చేసింది. ఒక చేతిలో గొడ్డలి, మరో చేతిలో తాడుతో మాస్ లుక్‌లో నాగచైతన్య ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రఘుల్ ధరుమాన్

వైరల్ వయ్యారి



గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా పరిచయమవుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వంలో వారాహి చలనచిత్రం బేనర్‌పై రజనీ కొర్రపాటి నిర్మించారు. శ్రీలీల కథానాయిక. ఈ నెల 18న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'జూనియర్' నుంచి రెండో పాటను యూనిట్ శుక్రవారం విడుదల చేసింది. 'వైరల్ వయ్యారి' అంటూ సాగే ఈ గీతానికి కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. దేవి శ్రీ ప్రసాద్ స్వరాలందించడంతో పాటు హరిప్రియతో కలసి ఆలపించారు. దేవి సంగీతంతో పాటు కిరీటి రెడ్డి, శ్రీలీల స్టెప్పులు ఈ పాటకు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కె. కె. సెంథిల్ కుమార్

పల్లెటూరి సరదాలు



మనోజ్ చంద్ర, మోనిక టి, ఉషా బోసెల ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న గ్రామీణ నేపథ్య వినోదాత్మక చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నటి, నిర్మాత ప్రవీణ పరుచూరి ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. రానా దగ్గుబాటి సమర్పణలో గోపాల కృష్ణ పరుచూరి, ప్రవీణ పరుచూరి నిర్మిస్తున్నారు. ఈనెల 18న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. మనోజ్ చంద్ర రికార్డ్ డ్యాన్స్ స్టూడియోని నడుపుతున్న యువకుడిగా కనిపించాడు. పల్లెటూరి జీవితాన్ని, సరదాలని అద్భుతంగా ఈ చిత్రంలో చూపించబోతున్నామని చిత్రబృందం పేర్కొంది.

జెన్కో జోరు.. రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి

- మార్కెట్లో కొనకుండానే కరెంటు సరఫరా
- అందుబాటులోకి శ్రీశైలం జలవిద్యుత్
- మొత్తం 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి
- డిమాండ్‌కు సరిపడా అందడంతో.. బయట కొనుగోలు చేయని డిస్కంలు

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో విద్యుత్ కొనుగోళ్లకు వెళ్లకుండానే.. డిమాండ్‌కు సరిపడా కరెంటును ఏపీ జెన్‌కో ఉత్పత్తి చేస్తోంది. శుక్రవారం రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసింది. రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థలు అందించిన సమాచారం మేరకు.. శుక్రవారం 199.498 మిలియన్ యూనిట్లను అవి ఉత్పత్తి చేశాయి. దీంతో.. మార్కెట్లో ఒక్క యూనిట్‌ను కూడా కొనుగోలు చేయకుండా డిస్కంలు డిమాండ్‌ను తట్టుకున్నాయి. శుక్రవారం ఏపీ జెన్కో ఆధ్వర్యంలోని థర్మల్ విద్యుత్కేంద్రాల్లో 78.015 మిలియన్ యూనిట్లు, జలవిద్యుత్కేంద్రాల్లో 19.869 మిలియన్ యూనిట్లు, జెన్కో సోలార్ కేంద్రాల్లో 1.588 మిలియన్ యూనిట్లు, సెంట్రల్ జనరేటింగ్ స్టేషన్లు 10.938 మిలియన్ యూనిట్లు, ఐపీపీ (సెయిల్, హెచ్ఎన్‌పీసీఎల్) 37.945 మిలియన్ యూనిట్లు, పవన విద్యుత్ 57.946 మిలియన్ యూనిట్లు, ప్రైవేటు సోలార్ 18.383 మిలియన్ యూనిట్లు, అంతర్రాష్ట్ర ఉత్పత్తి 1.206 మిలియన్ యూనిట్లు.. మొత్తం 199.498 మిలియన్ యూనిట్లను విద్యుత్ సంస్థలు అందించాయి. డిమాండ్ కూడా అంతే ఉండడంతో డిస్కంలు మార్కెట్లో కొనుగోలు చేయలేదు. శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్కేంద్రంలో ఉత్పత్తి కొనసాగుతోంది. 720 మెగావాట్లు అందుబాటులోకి వచ్చింది. కృష్ణపట్నం థర్మల్ మూడో యూనిట్ నుంచి 750 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయింది. వీటితో కలిపే 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ఇంకోవైపు.. థర్మల్ విద్యుదుత్పత్తి బాగానే ఉన్నందున ప్లాంట్లలో బొగ్గు నిల్వలను ఇంకా పెంచాలని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు. వీటీపీఎస్‌లో రోజుకు 41,500 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం కాగా.. 13 రోజులకు సరిపడా 5,48,586 టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఆర్‌టీపీపీలో రోజుకు 28,500 టన్నులు అవసరం కాగా.. రెండున్నర రోజులకు సరిపడా 74,549 టన్నుల నిల్వలే ఉన్నాయి. కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్‌లో రోజుకు 29,000 టన్నుల బొగ్గు అవసరం కాగా.. భారీగా 2,30,020 టన్నుల నిల్వలు ఉన్నాయి. సెయిల్‌లో రోజుకు 20,000 మెట్రిక్ టన్నుల బొగ్గుకు గాను 4,72,705 టన్నుల నిల్వలు ఉన్నాయి.

బకాయిలతో డిస్కంలు విలవిల..

రూ.7,562.48 కోట్ల బకాయిలు రాష్ట్ర డిస్కంలను భయపెడుతున్నాయి. నెలలోపే విద్యుత్ బకాయిలను తీర్చాలన్న నిబంధనలను దాటిన మొత్తాలు రూ.3,513.34 కోట్లు ఉన్నాయి. ఈ నెలలో చెల్లించాల్సిన బకాయిలు రూ.4,049.14 కోట్లు. ఈ మొత్తాలను తీర్చడానికి నిధుల కోసం డిస్కంలు అన్వేషణ ప్రారంభించాయి. అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు చేయడానికి సిద్ధమవుతున్నాయి.

ఇక 'స్మార్ట్' రేషన్ కార్డులు

- ఏటీఎం కార్డుల్లా రూపకల్పన
- క్యూఆర్ కోడ్‌తో వివరాలు ప్రత్యక్షం
- పాత కార్డుల స్థానంలో కొత్త కార్డులు
- నేతల ఫొటోలు లేకుండా ముద్రణ
- ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారు ఫొటో ఉండేలా చర్యలు
- సిద్ధమవుతున్న కొత్త స్మార్ట్ కార్డులు
- వచ్చే నెలలో పంపిణీకి ఏర్పాట్లు



అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ కార్డుల రూపుమారుతోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం కార్డులకు పార్టీ రంగులు పులిమేసి.. వాటిపై ఒకవైపు జగన్ బొమ్మ, మరోవైపు వైఎస్ రాజశేఖరరెడ్డి బొమ్మను ముద్రించి పంపిణీ చేసింది. ఇప్పుడు వాటికి స్వస్తి చెప్పి.. రాజకీయ పార్టీల రంగులు లేకుండా, నేతల బొమ్మలు ముద్రించకుండా కొత్త కార్డులను రూపొందిస్తున్నారు. పాత వాటి స్థానంలో ఈ కొత్త కార్డులు జారీ చేయడంతో పాటు ఇకపై కొత్తగా మంజూరు చేసే కార్డులన్నీ కూడా స్మార్ట్ కార్డులుగానే ఉండనున్నాయి. బ్యాంకు ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో ఈ స్మార్ట్ రేషన్ కార్డును రూపొందిస్తున్నారు. ఈ కార్డుల జారీకి పౌరసరఫరాల శాఖ ఇప్పటికే కసరత్తును పూర్తి చేసింది. స్మార్ట్ రేషన్ కార్డుపై ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, మరోవైపు కార్డుదారు (కుటుంబ పెద్ద) ఫోటో ఉంటాయి. ఆ రేషన్ కార్డు నంబరు, రేషన్‌షాపు నంబరు తదితర వివరాలుంటాయి. కార్డు వెనుకవైపు లబ్ధిదారు కుటుంబ సభ్యుల వివరాలుంటాయి. ఈ స్మార్ట్ రేషన్ కార్డును రేషన్ డీలర్ల వద్ద ఉండే ఈ-పోస్ యంత్రాల సహాయంతో స్కాన్ చేస్తే ఆ కుటుంబానికి సంబంధించిన వివరాలతో పాటు రేషన్ సరుకుల వినియోగానికి సంబంధించిన పూర్తి సమాచారం ప్రత్యక్షమవుతుంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే ఈ కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ముద్రణ కోసం ఏపీటీఎస్ ద్వారా టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. ప్రస్తుతం ముద్రణ దశలో ఉన్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను వచ్చే నెలలో పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

2 లక్షల కుటుంబాలకు కొత్తగా లబ్ధి

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1.46 కోట్లకుపైగా కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. వైసీపీ హయాంలో అర్హతలున్న నవదంపతులు, పేదలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నా అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో లక్షల సంఖ్యలో దరఖాస్తులు మూలనపడి ఉన్నాయి. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో అర్హులైనవారందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది. దీంతోపాటు తల్లిదండ్రుల నుంచి వేరుపడిన వారికి స్ప్లిట్ కార్డులు, ఉన్న రేషన్ కార్డులలో సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామాల మార్పులకు అవకాశం కల్పిస్తూ గత మే నెలలో దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. దీంతో ప్రతి జిల్లా నుంచి లక్షలాదిగా వచ్చిపడిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం 1,47,187 మంది దరఖాస్తులు చేసుకోగా.. వారిలో 89,864 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 38,046 మంది దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. కుటుంబ విభజన (స్ప్లిట్) కార్డుల కోసం 1,43,745 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 1,09,787 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 20,403 దరఖాస్తులను తిరస్కరించారు. ఇలా కొత్తగా మంజూరు చేసిన దాదాపు 2 లక్షల కొత్త రేషన్ కార్డులలోని లబ్ధిదారులకు సెప్టెంబరు నెల నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేసే అవకాశం ఉంది. కొత్తగా వచ్చిన కార్డులతో రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.48 కోట్లకు చేరింది.

అన్నవరం ప్రసాదం..
ఆషాఢంలో అదరహో

- ఒక్కనెలలోనే సుమారు 10 లక్షల ప్యాకెట్ల అమ్మకాలు
- అదనపు కౌంటర్లు, సిబ్బందికి ప్రత్యేక విధులు
- ఇప్పటికే సమకూరిన రూ.50లక్షల ఆదాయం


సత్యదేవుడి ప్రసాదం


అమ్మకాలకు కౌంటర్లో సిద్ధంగా ఉన్న ప్రసాదం ప్యాకెట్లు

అన్నవరం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి ప్రసాదం అంటే ఆకు కూడా వదలకుండా నాకేస్తారు. అంతటి అమృతమైన స్వామివారి ప్రసాదం అద్భుతమైన విక్రయాలు ఆషాఢమాసంలో జరుగుతాయి. సహజంగా ఆషాఢం శూన్యమాసం కావడంతో భక్తుల సంఖ్య అతి తక్కువగా ఉంటుంది. అయితే ఆషాఢమాసంలో సత్యదేవుడి ప్రసాదానికి అధిక డిమాండ్ నెలకుని భారీ ఎత్తున అమ్మకాలుంటాయి. ఒక్క ఆషాఢంలోనే సుమారు రూ.10లక్షల ప్యాకెట్ల విక్రయాలు జరుగుతాయని అధికారుల అంచనా. ఆషాఢమాసంలో తలుపులమ్మ లోవ దేవస్థానానికి భక్తులు అధికంగా తరలివెళుతుంటారు. తిరుగు ప్రయాణంలో వారంతా సత్యదేవుడి స్వామివారి ప్రసాదాలను కొనుగోలు చేసుకుని తమ స్వస్థలాలకు వెళ్లి బంధుమిత్రులకు పంచుతుంటారు. ఆషాఢమాసంలో కేవలం ప్రసాదాల విక్రయాల ద్వారా స్వామివారి ఖజానాకు రూ.2 కోట్లమేర ఆదా యం వస్తుంది. ఈ ప్రసాదం విక్రయాలు ఆది వారం, మంగళవారం, గురువారాల్లో మాత్రమే అధికంగా ఉంటాయి. వీటి కోసం దేవస్థానం యంత్రాంగం అన్న వరం జాతీయ రహదారిపై ఉన్న రెండు నమూనాలయాలు, తొలిపావంచా వద్ద అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయడమే కాకుండా సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయిస్తుంటారు. ఆషాఢం వారంలో మూడు రోజులు ప్రసాదం తయారు చేసే వంటస్వాములు, ప్యాకింగ్ సిబ్బంది కష్టపడుతుంటూనే ఉంటారు. ప్రసాదం తయారీకేంద్రంలో నిరంతర పర్యవేక్షణతో అమ్మకాల సమయంలో ఎక్కడా లేదు అనకుండా కౌంటర్ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ సిబ్బంది శ్రమిస్తుంటారు. శుచి, రుచితో కూడిన ప్రసాదం అందించడమే లక్ష్యమని ఈవో సుబ్బారావు పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఆషాఢ మాసంలో ఇప్పటివరకు 2 లక్షల 50వేల ప్యాకెట్లు విక్రయాలు జరగగా రూ.50లక్షల ఆదాయం లభించినట్టు ఆలయ అధికారులు తెలిపారు.


డొంకరాయి జలాశయంలో పెరిగిన నీటి నిల్వలు

జలాశయాలు కళకళ

మోతుగూడెం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా వర్షాలకు సీలేరు కాంప్లెక్స్‌లోని జలాశయాల్లో నీటి మట్టాలు స్వల్పంగా పెరిగాయి. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటి నిల్వలతో కళకళలాడుతున్నాయి. గురువారానికి జోలాపుట్టు జలాశయానికి 8936 క్యూసెక్కులు, బలిమెలకు 19,439, సీలేరుకు 1655, డొంకరాయికి 4030క్యూసెక్కుల నీటి నిల్వలు చేరాయి. గత 24గంటల్లో 250 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు జెన్‌కో అధికారులు తెలిపారు. ప్రస్తుతం బలిమెల, జోలాపుట్‌లో 28.91 టీఎంసీల నీటి నిల్వలు ఉండగా, ఇందులో ఏపీ వాటాగా 16.07 టీఎంసీలు ఉన్నాయి. గుంటవాడ, డొంకరాయి జలాశయాల్లో కలిపి 6.67 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం సీలేరు కాంప్లెక్స్‌లో 22.74 టీఎంసీల నిల్వలున్నారు. డిమాండ్ మేరకు కాంప్లెక్స్‌లో రోజుకు 4 నుంచి 5 మిలియన్ యూనిట్ల వరకూ విద్యుదుత్పత్తి చేస్తున్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

రాజమహేంద్రవరం, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత తెలిపారు. ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారం కావడానికి వీలుగా ముందస్తుగా కసరత్తు చేయడం జరిగిందన్నారు. రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, కుటుంబ వివాదాలు, చెక్ బౌన్స్, ప్రమాదాలు, బ్యాంకు సంబంధిత, ప్రీలి టిగేషన్ తదితర కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రేపు అంతర్ జిల్లా ఈత పోటీలకు ఎంపికలు

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 4 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా 10వ సబ్ జూనియర్స్, సీనియర్స్ ఈత పోటీలకు కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలోని స్విమ్మింగ్ పూల్‌లో ఆదివారం ఎంపికలు జరుగుతాయని కాకినాడ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి సతీష్, ముఖ్య సలహాదారు మంగా వెంకట శివరామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19, 20 తేదీల్లో ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగే పోటీలకు 2008 నుంచి 2014 మధ్య పుట్టిన వారితో బాల, బాలికల జిల్లా జట్లు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు ఉదయం 9 గంటలకు వయస్సు ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని అసోసియేషన్ కార్యదర్శి ఇరుసుమళ్ల రాజు కోరారు. వివరాలకు 9246690466లో సంప్రదించాలన్నారు.

మోటార్‌సైకిల్ ఢీకొని ఇద్దరికి గాయాలు

అమలాపురం రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా జాతీయ రహదారిపై పేరూరు శివారు తోట్లపాలెం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. మలికిపురం మండలం లక్కవరం గ్రామానికి చెందిన అరిగెల నాగేశ్వరరావు, రుద్రరాజు పాండురంగరాజు మోటారు సైకిల్‌పై అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బంధువులను పరామర్శించేందుకు బయలుదేరారు. బోడసకుర్రు బ్రిడ్జి దాటిన తరువాత తోట్లపాలెం వద్దకు వచ్చేసరికి ఎదురుగా ఎన్‌ఫీల్డ్ మోటారుసైకిల్ వేగంగా వచ్చి వారి వాహనాన్ని ఢీకొంది. నాగేశ్వరరావు తీవ్రంగా గాయపడగా పాండురంగరాజు స్వల్ప గాయాలపాలయ్యాడు. వారిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ వీరబాబు తెలిపారు.

గొల్లప్రోలు బైపాస్‌రోడ్డులో ఘర్షణ

ఒకరికి కత్తిపోట్లు

గొల్లప్రోలు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు బైపాస్‌లో 216వ జాతీయరహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన ఘర్షణలో వ్యక్తి కత్తిపోట్లుకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. బైపాస్ నుంచి తాటిపర్తి రోడ్డులోకి వెళ్లే పాయింట్ వద్ద అనిశెట్టి వంశీకి, జ్యోతుల రాము, ఊటా ఇంద్ర, మరో వ్యక్తికి వివాదం జరిగింది. ఇది తీవ్ర రూపం దాల్చి ఘర్షణకు దారితీయడంతో వంశీని కత్తితో పొడిచారు. తీవ్రంగా గాయపడిన అతడిని పిఠాపురంలోని ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. నిందితులపై గతంలో చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో కేసులు ఉన్నట్టు సమాచారం. పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ ఆసుపత్రిలో కత్తిపోట్లుకు గురైన వ్యక్తిని పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.


కత్తిపోట్లుకు గురైన వంశీతో మాట్లాడుతున్న పోలీసులు

చెడు వ్యసనాలకు బానిసలై..
ఇళ్ల వద్ద పార్కింగ్ బైక్‌ల చోరీలు

గోకవరంలో 14 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్ట్

16 బైక్‌లు స్వాధీనం



పట్టుబడిన నిందితులతో పోలీసులు, స్వాధీనం చేసుకున్న బైక్‌లు

గోకవరం, జూలై 4(ఆంధ్రజ్యోతి): మోటారు సైకిళ్లపై గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. గోకవరం గ్రామ శివారు బాపనమ్మ తల్లి గుడి వద్ద ఎస్‌ఐ పవన్‌కుమార్ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో 2 మోటారుసైకిళ్లపై ముగ్గురు 2 గోనె సంచులతో అనుమానాస్పదంగా కనిపించారు. వారి వద్ద సంచులను పరిశీలించగా గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గోకవరం మండలం కామరాజుపేట గ్రామానికి చెందిన పాసం కొండలరావు, వాకాడ పవన్‌కుమార్, కాకర్ల వెంకటకుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా బైక్‌ల దొంగతనాలు బయట పడ్డాయన్నారు. పట్టుబడిన ముగ్గురు తూర్పు గోదావరి, కాకినాడ, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఒడిస్సా ప్రాంతాల్లో ఇళ్ల వద్ద పార్కింగ్ చేసిన మోటారుసైకిళ్లను దొంగిలించి కామరాజుపేట శివారున ఉన్న ఫారెస్ట్ చెక్‌పోస్టు సమీపంలోని పైపులైన్ వద్ద దాచేవారు. వాటిని గోకవరానికి చెందిన ఆవుల వంశీ ఏజెన్సీ ప్రాంతాలకు తీసుకెళ్లి అక్కడ గంజాయికి మారుబేరం చేస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. ప్రస్తుతం వంశీ పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి 14 కిలోల గంజాయి, దొంగిలించిన 14 మోటారుసైకిళ్లు, గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన రెండు మోటా రుసైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ముగ్గురు వ్యక్తులు చెడు వ్యసనాలకు బానిసలై అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు డీఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో కోరుకొండ సీఐ వై. సత్యకిషోర్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం...
మెయిన్ వైర్ తగిలి బాలిక మృతి

కొవ్వూరు మండలం ధర్మవరంలో సంఘటన

ఆసుపత్రి ఎదుట గ్రామస్తుల ఆందోళన


సౌమ్యశ్రీ (ఫైల్‌ఫొటో)

కొవ్వూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం కారణంగా బాలిక మృతిచెందిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం ధర్మవరంలో జరిగింది. వివరాల ప్రకారం.. ధర్మవరం కొత్తపేట జగ్జీవన్‌రావు విగ్రహం సమీపంలో నివాసం ఉంటున్న జొన్నకూటి రామకృష్ణ, అరుణకుమారీకి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. గురువారం రాత్రి కురిసిన వర్షం, ఈదురుగాలులకు గ్రామంలో విద్యుత్ సరఫరా అయ్యే మెయిన్ వైరు జారి కిందకు వేలాడింది. శుక్రవారం రామకృష్ణ చిన్న కుమార్తె పాఠశాలకు వెళ్లడానికి పనులు చేసుకుంటూ ఇంటి ప్రాంగణంలో ఉన్న తాడుపై దుస్తులు ఆరేసుకుంటుంది. తాడు పై నుంచి (మనుషులకు తగిలే ఎత్తులో) విద్యుత్ మెయిన్‌వైరు వెళ్లడంతో సౌమ్యశ్రీ (15)కి విద్యుత్ షాక్ తగిలింది. ఇది గమనించిన అన్నయ్య అజయ్‌కుమార్, అతడి స్నేహితుడు కొడమంచిలి సిద్దూ సౌమ్యశ్రీని కాపాడే ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నంలో ఇద్దరికి గాయాలయ్యాయి. సిద్దూ స్థానికంగా చికిత్స పొందగా అజయ్‌కుమార్, సౌమ్యశ్రీని కొవ్వూరు తీసు కువెళ్లేలోపు సౌమ్యశ్రీ మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు పెద్దఎత్తున ఆసుపత్రికి చేరుకుని ఆందోళన చేపట్టారు. విద్యుత్ వైర్లు కిందకు ప్రమాదకరంగా వేలాడుతున్నాయని.. పైకి కట్టాలని పంచాయితీ అధికారులు, పాలకులకు, విద్యుత్ లైన్ మెన్‌లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఇంకా ఎంతమంది బలైపోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అన్నివిధాలా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తల్లి తండ్రుల ఫిర్యాదు మేరకు కొవ్వూరు రూరల్ ఎస్‌ఐ కె.శ్రీహరిరావు కేసు నమోదు చేశారు. మృతదేహానికి ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. సౌమ్యశ్రీ ధర్మవరం జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతుంది. ఈనెలైన పుట్టినరోజును చేసుకుంది. మరుసటి రోజే ఎంత దారుణం జరిగిపోయిందని బంధువులు కన్నీరు మున్నీరయ్యారు


ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

అదృశ్యమైన యువకుడి దారుణ హత్య

- పాతిపెట్టిన పది రోజుల అనంతరం వెలుగు చూసిన వైనం
- కాకినాడ జిల్లా పి.వేమవరంలో ఘటన
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు


హత్యకు గురైన కిరణ్‌కార్తీక్(ఫైల్)


సామర్లకోట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పి.వేమవరంలో నొక్కు కిరణ్‌కార్తీక్ (24) అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకుల చేతిలో అత్యంత దారుణంగా హత్యకు గురయ్యాడు. మృతదేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా గ్రామ శివారున జగనన్న లేఅవుట్ మైదానంలో గొయ్యితీసి పూడ్చివేశారు. పది రోజుల అనంతరం హత్యోదంతం వెలుగుచూసింది. మృతుడి తండ్రి వెంకటరమణ తన కుమారుడు కనిపించడం లేదంటూ సామర్లకోట పోలీసులకు గత నెల 27న ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. మృతుడు సంఘటనకు ముందువరకూ వినియోగించిన సెల్‌ఫోన్‌లో నిక్షిప్తమైన కాల్ నంబర్ల ఆధారంగా ఇద్దరు యువకులను పోలీ సులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించడంతో వాస్తవం బయటకు వచ్చింది. కార్తీక్‌ను హత్య చేసినట్టుగా భావించి అదే గ్రామానికి చెందిన నులకతట్టి కృష్ణప్రసాద్, అతడి మరో స్నేహితుడు వినోద్‌ను శుక్రవారం బ్రహ్మానందపురం జగనన్న లేఅవుట్ వద్దకు తీసుకురాగా కార్తీక్‌ను హతమార్చిన అనంతరం పాతిపెట్టిన గొయ్యిని పోలీసుల కు చూపించడంతో మృత దేహాన్ని వెలుపలికి తీశారు. అయితే హత్య జరిగిన పది రోజుల అనంతరం నిందితులు గ్రామ రెవెన్యూ అధికారి వద్ద లొంగి పోయినట్టు పోలీసులు చెబుతున్నారు. అనంతరం పంచనామాల ప్రక్రియ పూర్తిచేసి నింది తులను కాకినాడ కోర్టు ఎదుట శుక్రవారం హాజ రుపరిచారు. ఘటనా స్థలానికి చేరుకున్న మృ తుడి కుటుంబసభ్యులు బోరున విలపించారు. తన కుమారుడిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వీర వెంకటరమణ పోలీసుల ఎదుట డిమాండ్ చేశాడు.

సెల్‌ఫోన్ సంభాషణలే కారణమా?

కిరణ్ కార్తీక్ దారుణ హత్యకు ప్రధాన కారణం హత్య చేసిన కృష్ణప్రసాద్ చెల్లెలతో కిరణ్ కార్తీక్ సెల్‌ఫోన్‌లో తరచూ మాట్లాడుతుండడమేనని తెలుస్తుంది. తొలుత కార్తీక్‌ను కృష్ణప్రసాద్ హెచ్చరించినప్పటికీ అతడు ఖాతరు చేయకుండా ఫోన్ సంభాషణలు కొనసాగించడాన్ని సహించలేక కార్తీక్‌ను ఎలాగైనా తప్పించాలని కృష్ణప్రసాద్ పథకం వేశాడు. ఇందుకు అతడి స్నేహితుడు వినోద్‌ను ఉపయో గించాడు. వినోద్ ద్వారా కార్తీక్‌ను మందు పార్టీ ఉందని గతనెల 24న రాత్రి బ్రహ్మానందపురం శివారు జగనన్న లేఅవుట్ వద్దకు పిలిపించి కార్తీక్ తల పై కర్రతో బలంగా మోది పీకనులిమి కిరాత కంగా హత్య చేశారు. అక్కడే గొయ్యి తవ్వి పూడ్చి వేసి ఇంటికి చేరుకున్నారు. అయితే ఇంకా పలు అంశాలను పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

‘వంగవీటి రంగా కారణజన్ముడు’

మలికిపురం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వంగవీటి రంగా కారణ జన్ముడని, మూడు దశాబ్దాలు క్రితం ప్రజల నుంచి దూరమైనా వారి మదిలో చిరస్థాయిగా ఉన్న మహా నాయకుడని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రంగా తనయుడు వంగవీటి రాధా అన్నారు. శుక్రవారం రంగా జయంతి సందర్భంగా కోనసీమ జిల్లా మలికిపురంలో రంగా నిలువెత్తు విగ్రహాన్ని అభిమానులు ఏర్పాటు చేయగా వారిద్దరూ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సభలో మాట్లాడుతూ రంగా ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు పాటుపడాలన్నారు. బడుగు, బలహీనవర్గాల కోసం నిరంతరం పోరాటం చేసి బడుగుల కోసమే ప్రాణాలు అర్పించిన మహానేత అన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, దిరిశాల బాలాజీ, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, పినిశెట్టి బుజ్జి, ముప్పర్తి నాని, బొల్లం ప్రసాద్, ఎంపీపీ ఎంవీ సత్యవాణి తదితర నాయకులు పాల్గొన్నారు. వంగవీటి రాధాను చించినాడ వంతెన నుంచి యువకులు భారీగా ర్యాలీగా తీసుకువచ్చారు. దారిపొడవునా యువకులు నినాదాలు చేశారు.


మలికిపురంలో వంగవీటి రంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన వంగవీటి రాధా, ఎమ్మెల్యే దేవ

అరుణాచలేశ్వర ఆలయంలో ఆధ్యాత్మిక సందడి

ప్రత్తిపాడు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి అడ్డురోడ్డు వద్ద అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఆధ్యాత్మిక సందడి ప్రారంభమైంది. ఈ నెల 7న ఈ ఆలయంలో నాయినార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా 3రోజులు ముందు నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం ఆలయ వ్యవస్థాపకులు రామానంద స్వామి, ప్రముఖ నాయినార్ల చరిత్రకారణి ఆధ్యాత్మిక ప్రవచన కర్తఅరుణాచల మాధవి ఆధ్వర్యంలో అర్చకులు గోపూజ, గణపతి హోమం, లక్ష్మి హోమం, నవగ్రహ హోమాలు నిర్వహించారు.


గణపతి పూజ నిర్వహిస్తున్న వేద పండితులు

గండి పోశమ్మ ఆలయంలోకి వరదనీరు



గండి పోశమ్మ ఆలయంలోకి వచ్చిన వరద నీరు

దేవీపట్నం, జూలై 4(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం గొందూరు గ్రామంలో వేంచేసిఉన్న స్వయంభూ మాతృ శ్రీగండి పోశమ్మ ఆలయంలోకి వరద నీరు ప్రవేశించింది. దీంతో దర్శనాలను తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. అనుమతించే తేదీ ప్రకటించేవరకు ఎవరు ఆలయం పరిసర ప్రాంతాలకు రాకూడదన్నారు.

వాడపల్లి క్షేత్రంలో సెల్‌ఫోన్లు భద్రపరుచుకునేందుకు
రూ.62 లక్షలకు టెండర్ హెచ్చుపాట


టెండర్లు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సెల్‌ఫోన్లు భద్రపరుచుకునేందుకు శుక్రవారం నిర్వహించిన టెండర్‌లో రూ.62 లక్షలకు ఓ వ్యక్తి హెచ్చుపాటను దక్కించుకున్నాడు. వాడపల్లి క్షేత్రంలో 7 ప్రదక్షిణలు నిర్వహించుకునే సమయంలో భక్తుల సెల్‌ఫోన్లు చోరీకి గురవుతున్నాయి. గతేడాది నుంచే సెల్‌ఫోన్లు భద్రపరుచుకునేందుకు లాకర్లను ఏర్పాటు చేసి టెండర్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. భక్తుల పాదరక్షకులు భద్రపరుచుకునేందుకు రూ.5 లక్షలు, లగేజీ బ్యాగ్‌లు భద్రపరుచుకునేందుకు రూ.5 లక్షలు టెండర్ దాఖలు చేసి సొంతం చేసుకున్నారు. సెల్‌ఫోన్ భద్రపరుచుకునేందుకు రూ.5, చెప్పులు, బ్యాగులు భద్రపరుచుకునేందుకు రూ.2 భక్తులు చెల్లించాలి. టెండర్లను ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షించారు. శుక్రవారం అధికసంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రూ.3,99,132 ఆదాయం లభించినట్టు ఈవో తెలిపారు.

‘లోవ’ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక


మాస్టర్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న దేవదాయ శాఖాధికారులు

తుని రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో భవిష్యత్ తరాల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికను దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించారు. ఈ మేరకు పలువురు నిష్ణాతులైన ఇంజనీరింగ్ అధికారులతో మాస్టర్ ప్లాన్ రూపొందించగా వీటిపై శుక్రవారం ఇంజనీరింగ్ అధికారులు లోవ క్షేత్రంలో పర్యటించి వాటి అమలు రూపకల్పనకు సాధ్యసాధ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.దుర్గేష్‌కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.ఉదయభాస్కర్, డిప్యూటీ స్థపతి శ్రీనివాసచార్యులు, ఈవో విశ్వనాధ్‌రాజు పాల్గొన్నారు.

సారె సమర్పణ

ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా లోవ క్షేత్రంలో తలుపులమ్మ అమ్మవారికి శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి భక్తసమాజం ఆధ్వర్యంలో తుని పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారికి సారె సమర్పించేందుకు తరలివచ్చారు. ఆలయ పండితులు స్వాగతం పలకగా అమ్మవారికి నూతనవస్త్రాలతో పాటు పండ్లు, పుష్పాలు, పొంగళ్లు, పిండి వంటలు నైవేద్యంగా సమర్పించుకున్నారు. ఆలయ పండితులు వేద ఆశీర్వాదం గావించి మహాప్రసాదం భక్తులకు అందించారు.



తలుపులమ్మకు సారె సమర్పించేందుకు వచ్చిన భక్తులు

తాటిపాకలో మాజీ సీఎం రోశయ్య జయంతి

రాజోలు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 92వ జయంతిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం తాటిపాకలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రోశయ్య విగ్రహానికి ఆయనతో పాటు సంఘ సభ్యులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. 92 మంది పారిశుధ్య సిబ్బందికి, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కంచర్ల బాబి మాట్లాడుతూ మాజీ సీఎం రోశయ్య జయంతిని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ప్రతి ఆర్యవైశ్యుడు గర్వించాల్సిన విషయమని, ఇటువంటి మంచి నిర్ణయం తీసుకున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి ఆర్యవైశ్యులందరి తరపున కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్ లకీకపూల్‌లో రోశయ్య కాంస్య విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఏపీఐఐసీ మాజీ ఛైర్మన్ శ్రీఘాకోళపు శివరామసుబ్రహ్మణ్యం పిలుపు మేరకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. మంత్రి కందుల దుర్గేష్ నుంచి ఉత్తమ ప్రెసిడెంట్ అవార్డు అందుకున్న రాజోలు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కాసు శ్రీనివాస్‌కు దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఉమ్మడి తూర్పు గోదావరి ఆర్యవైశ్య సంఘం వాణిజ్య విభాగం ఛైర్మన్ లక్కింశెట్టి బాబులు, నానాజీ, రత్నబాబు, నాగబాబు, పోశెట్టి బుజ్జి, సూరిబాబు, కొత్త శ్రీనివాసరావు, రాజానాగరత్నకుమార్ పాల్గొన్నారు.


తాటిపాకలో పారిశుధ్య సిబ్బందికి దుప్పట్లు పంపిణీ చేస్తున్న కంచర్ల బాబి

చిరస్మరణీయుడు వంగవీటి రంగా

మాధవరాయుడుపాలెంలో రంగా విగ్రహావిష్కరణ.. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



ఎంఆర్ పాలెంలో రంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన దృశ్యం

కడియం, జూలై 4(ఆంధ్రజ్యోతి): రంగా బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం చేసిన పోరాటంలో హత్యకు గురయ్యారన్నారు. ఆ మహనీయుడు తెలుగు రాష్ట్రాల్లో చిరస్థాయిగా మిగిలిపోయారని వంగవీటి నరేంద్ర(రంగా సోదరుడి కుమారుడు), జక్కంపూడి గణేష్ అన్నారు. మండలం మాధవరాయుడుపాలెంలో ఏర్పాటు చేసిన వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని శుక్రవారం రంగా జయంతి సందర్భంగా వారు ముగ్గురు విచ్చేసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ అన్నందేవుల చంటి, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, సంగీత సూరిబాబు, సంగీత వెంకటేశ్వరరావు, ఆదిమూలం సాయి బాబా, పాటంశెట్టి రవి, నాగిరెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు. వీరవరంలో రంగాపార్కు వద్ద జరిగిన కార్యక్రమానికి వంగవీటి నరేంద్ర ముఖ్యఅతిథిగా విచ్చేసి రంగా విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ పార్కులో నూతనంగా నిర్మించిన షెడ్డును ప్రారంభించారు. కడియంలో రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వెలుగుబంటి నాని, గిరజాల బాబు, తాడాల చక్రవర్తి, పాల్గొని నివాళులర్పించారు. జేగురుపాడులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ యాదల స్టాలిన్, ఉపసర్పంచ్ పాతూరి రాజేష్, ఎంపీటీసీ నాగిరెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక దేవిచౌక్‌లోని కాపునాడు కార్యాలయం వద్ద రాజమండ్రి కాపునాడు కార్యవర్గం ఆధ్వర్యంలో రంగా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవాణి డెంటల్ హాస్పిటల్ సౌజన్యంతో దంత, అగర్వాల్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నేత్ర వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. సుమారు 500 మందికి బీపీ, షుగర్, వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో నగర జనసేన అధ్యక్షుడు వై.శ్రీనివాస్, గుదే రఘు నరేష్, ముమ్మిడి వీరబాబు, కాళ్ల చక్రరావు, దేశినీడి రాంబాబు, వురింకల సతీష్, పిల్లా దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ధవళేశ్వరం: స్థానిక బాలికోన్నత పాఠశాల వద్ద రంగా విగ్రహానికి మాజీ ఉపసర్పంచ్ మండా సత్తులు ఆధ్వర్యంలో పలువురు కాపు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన యువ నాయకుడు రంకిరెడ్డి వెంకటేష్ చిత్రపటానికి నివాళులర్పిస్తూ మౌనం పాటించారు. కార్యక్రమంలో నాయకులు యడ్ల మహేష్, జేటీ రామారావు, ఆళ్ల ఆనందరావు, సాధనాల శివ, అనూశ్రీ సత్యనారాయణ, ముత్యాల పోసికుమార్, శ్రీరంగం బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమ్మెను జయప్రదం చేయండి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు

ధవళేశ్వరం/రాజమహేంద్రవరం అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఈ నెల 9న కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు కార్మికులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక జాతీయ రహదారిపై ఉన్న హార్లిక్ ఫ్యాక్టరీ గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, అధిక పని గంటల విధానాన్ని వ్యతిరేకించాలని, స్మార్ట్ విద్యుత్ మీటర్లను వ్యతిరేకించాలని కోరారు. సమ్మెలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్, టి.అరుణ్, కర్రి రామకృష్ణ, ఎస్ఎస్ మూర్తి, కేఎస్‌వీ రామచంద్రరావు, హార్లిక్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నేదునూరి గంగాధరం జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): జానపద వాఙ్మయ బ్రహ్మ నేదునూరి గంగాధరం 122వ జయంతి శుక్రవారం స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద నేదునూరి గ్రంథాలయంలో జరిగింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాదృష్టి సంస్థ అధినేత ఎ.కృష్ణశర్మ మాట్లాడుతూ పల్లె పల్లెల్లో కష్టపడి తిరిగి, కొన్ని వేల జానపదాలను, పల్లె పదాలను కవితలను, నేటి తరానికి అందించిన నేదునూరి కృషిని ఎప్పటికీ మరువలేమని, ఆయన రచనల ద్వారా ఎప్పటికీ అందరి మదిలో చిరస్థాయిగా ఉంటారని కొనియాడారు. గంగాధరం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేదునూరి పురస్కారాలను నన్నయ యూనివర్సిటీ తెలుగు విభాగాధిపతి టి.శ్రీనివాస్, ఫిజియోథెరపిస్ట్, డాక్టర్ గిరజాల సోమరాజు నాయుడు, శివ సాయి నృత్య కళా క్షేత్రం టి.మాధవిలకు అందించి సత్కరించారు. కార్యక్రమానికి కళారత్న పీవీఎస్ కృష్ణారావు, కంభంపాటి శ్రీనివాస్, రచయిత్రి శ్రీపాద సీతామహాలక్ష్మి, నేదునూరి కుమార్తె సూర్యప్రభావతి ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీల్లో దుళ్ల ఎడ్లు ప్రథమం

కడియం, జూలై 4(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట నియోజకవర్గం మామిడాడలో జరిగిన రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పందాల్లో కడియం మండలం దుళ్ళకు చెందిన తూము శ్రీను ఎడ్లు జత విజేతగా నిలిచింది. 2 కిలోమీటర్ల దూరాన్ని 4 ని.. 17 సెకన్లలో పరుగెత్తి ప్రథమస్థానాన్ని పొందాయి. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ,మాజీ మంత్రి తోట నరసింహం, జడ్పీ మాజీ చైర్మెన్ జ్యోతుల నవీన్ చేతుల మీదుగా తూము శ్రీను బహుమతి అందుకున్నారు.

జీఐసీ పెన్షనర్ల నిరసన

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు ఇచ్చే రీతిగా తమ పెన్షన్లను నవీకరించాలని ఆలిండియా ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. పెన్షనర్ల డిమాండ్స్ డే సందర్భంగా మోరంపూడి ఎల్ఐసీ డివిజనల్ ఆఫీసు వద్ద ఎల్ఐసీ జీఐసీ పెన్షనర్లు శుక్రవారం ఉదయం నిరసన తెలిపారు. అనంతరం సీనియర్ డివిజనల్ మేనేజరుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వై.రఘునాథరావు,కేఎస్ మూర్తి, సీవీ రామారావు, పీవీ మురళీకృష్ణ, బీవీ రమణ, జీవీ అప్పారావు పాల్గొన్నారు.

'ఫార్మశీ రంగంలో మెడికల్ కోడింగ్‌ది ముఖ్యపాత్ర'

దివాన్‌చెరువు, జూలై4 (అంధ్రజ్యోతి) ఫార్మశీరంగంలో మెడికల్ కోడింగ్ ముఖ్య పాత్రపోషిస్తుందని దివాన్‌చెరువులోని విజె కళాశాల ప్రిన్సిపాల్ డి.నరేంద్ర అన్నారు. విజె ఫార్మశీ కళాశాలలో డివైన్ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో మెడికల్ కోడింగ్‌పై శుక్రవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఎన్.వి.వి.జగన్మోహనరెడ్డి,విజయన్ శేఖర్, దీపికా విజయన్ పాల్గొన్నారు.

శాకంబరిగా మాచరమ్మ

కడియం, జూలై 4(ఆంధ్రజ్యోతి): మురమండ మాచరమ్మతల్లి శుక్రవారం భక్తులకు శాకంబరిగా దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ పూజలు జరిగాయి. మరో రెండు రోజుల పాటు మాచరమ్మ శాకంబరిగా దర్శనమిస్తారని భక్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాటి జానకిరామయ్య, మద్దిపాటి సత్యనారాయణ, ప్రత్తిపాటి వేంకటరామయ్యచౌదరి, చెరుకూరి హరేరామ్, ప్రత్తిపాటి రామారావుచౌదరి పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయాలి : టీకే

రాజమహేంద్రవరం సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ అదానీ కంపెనీతో సెకి ద్వారా చేసుకున్న స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లు దీనిపై స్పష్టత ఇవ్వాలన్నారు.లోకేశ్ పాదయాత్రలో స్మార్ట్ మీటర్లు బిగించడానికి అదానీ సంస్థ ఉద్యోగులు ఇళ్లకు వస్తే ఆ మీటర్లను బద్దలు కొట్టమని పిలుపునిచ్చారని గుర్తుచేశారు. ఎవరైనా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడానికి వస్తే ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం జగన్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేసారు.సమావేశంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు జేటి రామారావు, సిటీ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ పట్నాల శ్రీనివాసరావు,బిల్డర్ బాబీ, కిశోర్ కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడులు రాకూడదనే వైసీపీ అరాచకం

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రానికి పెట్టుబడులు రాకూడదు, అభివృద్ధి జరగకూడదని వైసీపీ ప్రధానంగా ఒక స్ట్రాటజీ అమలు చేస్తోందని అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విమర్శించారు. రాజమహేంద్రవరంలోని జిల్లా బీజేపీ కార్యాలయానికి వచ్చిన ఆయన శుక్రవారం మీడియా అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు. గ్రామస్థాయి నాయకుడి దగ్గర నుంచి జగన్మోహనరెడ్డి వరకూ అరాచకం సృష్టిస్తాం, 2.0 చూస్తారని చెప్పడం అందులో భాగమే అని పేర్కొన్నారు.ఆనాడు చంద్రబాబును, మమ్మల్ని జైల్లో పెట్టి శునకానందం పొందింది వైసీపీ వాళ్లే. జైల్లో పెట్టి ఏం సాధించారు. చివరకు అధికారం కూటమికి అప్పగించారన్నారు. వంశీ, కొడాలి నాని వంటి వాళ్ల మాట్లాడే భాష కానీ, వాళ్లు ప్రవర్తించే విధానం కానీ, బాడీ లాంగ్వేజ్ కానీ ఏ విధంగా ఉంటుందో మనందరికీ తెలుసన్నారు. తన కారుకింద పడి ఒక వ్యక్తి చనిపోతే కనీస మానత్వం లేకుండా జగన్ వెళ్లిపోయాడన్నారు. ఆయనకు రాజకీయ ప్రయోజనాలు తప్ప ఏదీ ముఖ్యం కాదు అనేది అర్థమవుతుందన్నారు. ఇప్పటికే ప్రజలు గమనించారన్నారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాలకు 8న ప్రీ బిడ్ సమావేశం

కొవ్వూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఆర్టీసీ డిపో పరిధిలోని పాత బస్టాండ్ బిట్ - 1, (198 స్క్వేర్ యార్డ్సు), కొత్త బస్టాండ్‌లో బిట్-2(296 స్క్వేర్ యార్డ్సు)లో ఖాళీగా ఉన్న ఓపెన్ స్పేస్ 15 ఏళ్ల పథకం కింద ఈ నెల 8న రాజమహేంద్రవరంలోని ఆర్టీసీ కార్యాలయంలో ప్రీ బిడ్ సమావేశం నిర్వహిస్తున్నట్టు డీఎం తెలిపారు.

అగ్గి పిడుగు.. అల్లూరి

» ఘనంగా మన్యం వీరుడి జయంతి
» నివాళులర్పించిన పలువురు నాయకులు, అధికారులు



రంగాపురంలో అల్లూరికి నివాళులు అర్పిస్తున్న కూటమి నేతలు

బిక్కవోలు, జూలై 4(ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పలువురు నాయకులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రంగాపురంలో కూటమి నేతలు అల్లూరి విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని మెయిన్, నెం.1 పాఠశాలల్లోని విద్యార్థులకు పెన్నులు, బిస్కెట్లు అందజేశారు. సచివాలయంలో కూడా అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ కేతా యేసురత్నం, కానాటి అప్పలస్వామి, నడింపిల్లి చిరంజీవిరాజు, చెల్లే జోష్‌బాబు, తుట్టా శివ పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి ఎంపీడీవో వి.శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఏవో నాగేంద్రప్రసాద్, ఏపీవో అగస్టీన్‌కుమార్, ఏపీఎం సుప్రియ, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువు: రాజానగరం మండలం నామవరంలోని భారతీయ విద్య భవన్స్‌లో జరిగిన కార్యక్రమానికి పాఠశాల పూర్వ విద్యార్థి, తైవాన్‌లో జరిగిన గ్లోబల్ మాస్టర్స్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌కు భారత ప్రతినిధిగా వ్యవహరించిన ఎంఎస్ఆర్ ఇంద్రరాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మన్యంవీరుడు అల్లూరిసీతారామరాజు జీవితం ఆనాటి ఎందరో స్వాతంత్ర్య ఉద్యమవీరులకు ఆదర్శప్రాయమన్నారు. ఎందరో వీరుల త్యాగఫలంగానే మనకు స్వాతంత్ర్యం సిద్ధించిందని, వారిని స్మరించుకోవడం మన కర్తవ్యమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సూర్యన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమానికి వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ విచ్చేసి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యువత సమాజం పట్ల బాధ్యతతో మెలగాలని చెప్పారు. విద్యార్థులు అల్లూరి స్ఫూర్తితో విద్యలో రాణిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

కడియం: కడియంలో మండల దళిత నాయకుల ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాయల సత్యనారాయణ, జల్లి కృపారావు, విప్పర్తి శ్రీను, కనికెళ్ల బుల్లియ్య, బొల్లాడి జాన్‌బాబు పాల్గొన్నారు. అలాగే బీజేపీ ఆధ్వర్యంలోను అల్లూరి విగ్రహానికి నివాళులర్పించారు. పేదలకు ఆహార పొట్లాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు బొర్ర సుబ్రహ్మణ్యం, ఆకుల శ్రీధర్, కోటికలపూడి వెంకటేశ్వరరావు, చిక్కాల శ్రీను, గుత్తుల హరిప్రసాద్, గారపాటి తాతబ్బాయి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక మార్గాని ఎస్టేట్స్‌లోని వైసీపీ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి.. విప్లవ పంథా లో పోరాటాన్ని ఎంచుకుని, గిరిజనులను సమాయత్తం చేసి, బ్రిటిష్ వారిని గడగడలాడించారని, ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని అన్నారు.



రంగంపేటలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

రంగంపేట: మండలంలోని కోటపాడు గ్రామంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి బీజేపీ మండలాధ్యక్షుడు షైలవరపు సాయిరామ్ పూలమాలలు వేసి నివాళర్పించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటిష్ వారిని గడగడలాడించిన అల్లూరి జీవితం నేటి సమాజానికి ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో మండవిల్లి గుప్తా, కొండేపూడి శ్రీనివాస్, ఉండవిల్లి గంగాధర్, సాయితాతారావు, పోతుల వీర సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ సభ్యులు అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యుడు మణికంఠ మాట్లాడుతూ అల్లూరి పోరాట స్ఫూర్తి గొప్పదని, దానిని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ 2019 నుంచి అధికారులకు వినతిపత్రాలు ఇస్తూ, అనేక ధర్నా లు నిర్వహించిదన్నారు. ఇప్పటికైనా స్పందించి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విద్యాశాఖ మంత్రిని ఆ మేరకు కలిసి వినతిపత్రం ఇవ్వడాన్ని ఎస్ఎఫ్ఐ స్వాగతిస్తున్నామన్నారు.కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కళాశాల కమిటీ నాయకులు హేమకిరణ్, పవన్ కుమార్, నాని తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించిన మార్గాని భరత్

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక జేఎన్ రోడ్డు రామాలయం సెంటర్‌లో క్షత్రియ సేవా సమితి, క్షత్రియ యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ముఖ్యఅతిథిగా విచ్చేసి అల్లూరి విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. దేశం కోసం అతి చిన్న వయస్సులోనే ప్రాణాలర్పించిన గొప్ప పోరాట స్ఫూర్తి ప్రదాత అల్లూరి అని అన్నారు. కార్యక్రమంలో దాట్ల వెంకటపతి రాజు, దాట్ల భాస్కరరాజు, దంతులూరి సూర్యసుబ్బరాజు, శ్రీకన్యరాజు, కోసూరి చండీప్రియ, పేరిచర్ల సూర్యప్రభావతి, ఎస్ఎస్ రాజు పాల్గొన్నారు.

నగర ఆదాయం పెంపునకు కృషి

» రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్మెంట్ సమీక్షలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి, ఎమ్మెల్సీ సోము
» స్వర్ణాంధ్ర-2047 లో విలీన గ్రామాలతో సహా ప్లానింగ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఆదాయాన్ని పెంచి, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే రీతిలో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన స్వర్ణాంధ్ర-2047 రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్మెంట్ సమీక్ష సమావేశం అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అధ్యక్షతన జరిగింది. దీనికి అర్బన్ నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే వాసు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, సీపీవో, శెట్టిబలిజ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు యేసు, కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ విచ్చేశారు. తొలుత సమీక్ష అంశాలైన జీవో ప్రోవర్టి కింద పీ4 మోడల్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పరిశ్రమలు, సర్వీస్ సెక్టార్, హెల్త్, టూరింజం డవలప్మెంట్, గోదావరి పరిక్షణ, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చడం తదితర అంశాలపై శాశ్వత ప్రాతిపదికన ప్రణాళికబద్ధంగా ముందుకు సాగడంపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 విజనరీతో సీఎం చంద్రబాబు ముందుకు వెళ్తున్నారన్నారు. సర్వీస్ సెక్టార్ ద్వారానే నగరానికి 80శాతం ఆదాయం వస్తుందన్నారు. రాజమహేంద్రవరంలో ఓల్డ్‌సిటీకి ప్రాధాన్యమిస్తూనే నగరాన్ని మరింత విస్తరించాలన్నారు. కల్చరల్ క్యాపిటల్‌ను నెక్స్ట్ స్థాయికి తీసుకెళ్దామన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ రాజమహేంద్రవరం అభివృద్ధి శాశ్వత ప్రాతిపదికన ఉండాలన్నారు. గ్రామాల విలీనం జరగాలన్నారు. నగరం నుంచి జిల్లాలో అన్ని ప్రాంతాలకు కనెక్టివిటీ ఉండాలని, పోలవరం ప్రాజెక్టు వద్ద 5స్టార్ హోటల్ కడుతున్నారని, శ్రీరామగిరికి పర్యాటక అభివృద్ధి వుందని, గోదావరి లంకల అభివృద్ధి తదితర అంశాలతో రాజమహేంద్రవరం ముడిపడివుందన్నారు. అనంతరం కార్పొరేషన్ ఈఈ మదర్సాఅలీ మాట్లాడుతూ నగరంలో మురుగునీరు, వర్షపు నీరు దారిమళ్లించేందుకు డ్రైనేజీ నిర్మాణ వివరాలు వెల్లడించారు. ఆవలో నిర్మిస్తున్న ఎస్‌టీపీ, ఎస్ఆర్‌జీ ప్లాంట్ల గురించి వివరించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, రాకీ చానల్ అనుసంధానంపై వివరణ ఇచ్చారు. పబ్లిక్ హెల్త్ ఎస్ఈ పాండురంగారావు మాట్లాడుతూ అమృత్ ఫేజ్-2 పథకం నిధులు, వాటి వినియోగంపై వివరణ ఇచ్చారు. ఇంకా విడుదల కావాల్సిన నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి రిప్రజెంట్ చేసామన్నారు. ఎస్‌టీపీ ప్లాంట్ మనుగడలోకి వస్తే నగరంలో మురుగు నీరు శుద్ధిచేసి గోదావరిలో కలుపవచ్చన్నారు. టౌన్ ప్లానింగ్ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ మూర్తి మాట్లాడుతూ జాతీయ రహదారి నుంచి రాజమహేంద్రవరంలోకి నేరుగా చేరుకునే విధంగా రోడ్డు విస్తరణలు జరగాలన్నారు. నగరంలో ముఖ్యమైన రహదారులను విస్తరించాలన్నారు. రాజమహేంద్రవరం నుంచి ధవళేశ్వరం బ్యారేజీ వరకు అభివృద్ధి చేయాలని, టెంపుల్ టూరిజాన్ని మరింత అభివృద్ధి చేయాలని అభిప్రాయాలను వెల్లడించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అర్బన్ హెల్త్ సెంటర్లలో సదుపాయాలను మెరుగుపరిచామన్నారు. నగరంలో క్షయ వ్యాధిని 80శాతం నిర్మూలించామని, మహిళల్లో 13శాతం మందికే రక్తహీనత వుందని దానిని జీరో శాతానికి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. చివరిగా ఎమ్మెల్యే వాసు, ఎమ్మెల్సీ సోము మాట్లాడారు. వికసిత రాజమహేంద్రవరానికి అన్ని శాఖలు సమన్వయంతో సహకరించాలన్నారు. టూరిజం హబ్, హెరిటేజ్ సిటీగా రాజమహేంద్రవరాన్ని అభివృద్ధి చేయడం, నగరం ఆదాయాన్ని పెంచుకునే విధంగా ముందుకు వెళ్దామన్నారు. సమావేశంలో కార్పొరేషన్ హెచ్‌వోడీలు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్ సర్వీసులు

గోకవరం, జూలై4(ఆంధ్రజ్యోతి): గోకవరం ఆర్టీసీ డిపో నుంచి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలకు సూపర్ లగ్జరీ బస్ సర్వీసులను నడుపుతున్నట్టు డిపో మేనేజర్ మార్గరేట్ శుక్రవారం తెలిపారు. ఈ బస్సులు ఈనెల 9న బయలుదేరి 13న గోకవరం చేరుకుంటాయన్నారు. అరుణాచలం, విష్ణుకంచి, శివకంచి, తిరుపతి, శ్రీకాళహస్తి వంటి పుణ్యక్షేత్రాలను ఈ సర్వీసుల ద్వారా భక్తులు దర్శించుకోవచ్చున్నారు. ఐదు రోజుల పాటు సాగే ఈయాత్రకు టిక్కెట్ ధర రూ.4,600గా నిర్ణయించినట్టు డీఎం తెలిపారు.

సారా కేసులో ఇద్దరి అరెస్టు

సీతానగరం, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రఘుదేవపురం, సీతానగరం గ్రామాల్లో సారా విక్రయిస్తు్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు కోరుకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ బాలాజీ శుక్రవారం తెలిపారు. ఎక్సైజ్ సిబ్బంది, స్థానిక పోలీసులు ఈ దాడులు నిర్వహించారు. రఘుదేవపురంలో సారా విక్రయిస్తున్న దియ నాగమణిని అదుపులోకి తీసుకుని 5 లీటర్లు, సీతానగరంలో సారా విక్రయిస్తున్న గుత్తుల దుర్గా భవానిని అదుపులోకి తీసుకుని 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చుతామని తెలిపారు.

అల్లూరికి ఘన నివాళి

ధవళేశ్వరం, జూలై 4(ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని స్థానిక మసీదు సెంటర్ వద్ద ఉన్న ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అల్లూరి ఆశయ సాధన నేటి యువతలో స్ఫూర్తిని రగిలిస్తుందని వక్తలు అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఒంటెద్దు స్వామి, మెండా సత్తులు, ఆళ్ల విఠల్, అడపా శ్రీనివాస్, ముత్యాల పోసుకుమార్, అల్లంపల్లి ముత్యాలు, మెండా రాజేష్ పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

దివాన్‌చెరువు, జూలై4 (ఆంధ్రజ్యోతి) విద్యార్థులు క్రీడల్లో రాణించాలని, ఈ మేరకు ప్రోత్సహించాల్సిన బాధ్యత ఫిజికల్ డైరెక్టర్లపై ఉందని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలకు చెందిన వ్యాయామవిద్య సీనియర్ ఫ్యాకల్టీతో వీసీ శుక్రవారం సమావేశమయ్యారు. అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడాపోటీల నిర్వహణ ప్రతిపాదనలపైన పలు అంశాలపై చర్చించారు. కళాశాలల మైదానాల్లో ప్రతీరోజూ ఒక గంటసేపు విద్యార్థులు వివిధ ఆటల్లో పాల్గొనాలని తద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. అన్ని కళాశాలల్లో పీడీలను నియమించాలని సూచించారు.త్వరలో వర్శిటీ స్థాయిలో పీడీలకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.

తొలి అడుగును విజయవంతం చేయండి

రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి



రాఘవాపురంలో మహిళకు కరపత్రం అందజేస్తున్న బీవీఆర్

రాజానగరం/కోరుకొండ, జూలై 4(ఆంధ్రజ్యోతి): కూటమి ఏడాది పాలనలో సాధించిన విజయాలపై చేప ట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి పిలుపునిచ్చారు. రాజానగరం మండలం చక్రద్వారబంధం, కోరుకొండ మండలం రాఘవాపురం గ్రామాల్లో శుక్రవారం తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. చక్రద్వారబంధంలోని కళ్యాణ మండపంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేశారు. ప్రతి నాయకుడు, కార్యకర్త గ్రామాల్లో ప్రతి కుటుంబాన్ని పలకరించి, ప్రభుత్వ పరంగా ఎదురవుతున్న సమస్యలు తెలుసుకుని, చేకూరుతున్న లబ్ధిని వివరించాలన్నారు. ఏడాది పాలనలో చేసిన అభివృద్ధిని తెలియజేయాలన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యమే కాకుండా రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోని నెట్టిందన్నారు. కూటమి ఏడాది పాలనలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి ఏడాది పాలనలో సాధించిన విజయాలపై ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో ప్రజల అభిప్రాయాలు నమోదు చేశారు. స్థానికులు ప్రజా సమస్యలపై అర్జీలను బీవీఆర్‌కు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గంగిశెట్టి చంటిబాబు, కందుల బాబూరాయుడు, బత్తుల త్రిమూర్తులు, వంక మల్లిబాబు, బచ్చు ప్రసాద్, నూనె వెంకన్న, సోడసాని త్రిమూర్తులు, సోడసాని రామారావు, పెద్దిశెట్టి నారాయణస్వామి, నార్గాని బంగారయ్య, రాఘవాపురంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే నాగేశ్వరావు, అడపా వీరబాబు, ముంగ్రు గాంధి, కోర్పు బుజ్జి, రాంబాబు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌తో సంతోషం: వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని 46వ డివిజన్‌లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పర్యటించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజలను అడిగి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి ఇంట్లో సంతోషం వెల్లివిరుస్తుందన్నారు. రాష్ట్రంలో పేదరికరం లేని ఇల్లు చూడాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, కుడుపూడి సత్తిబాబు, యర్రా వేణుగోపాలరాయుడు, మజ్జి రాంబాబు బుడ్డిగ రాదా, మొకమాటి సత్యనారాయణ, అగురు ధనరాజు, పిడిమి ప్రకాష్, తురకల నిర్మల పాల్గొన్నారు.

సేంద్రీయ ఎరువులతో నాణ్యమైన దిగుబడులు

రాజమహేంద్రవరం రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): రసాయన పురుగు మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువుల వినియోగించడం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని రూరల్ మండల వ్యవసాయాధికారి భీమరాజు తెలిపారు. మండలంలోని రాజవోలు గ్రామంలో శుక్రవారం ఐఎన్‌డీజీఏపీ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేలైన పంట సాగు పద్ధతులు, మనుషులపై రసాయనిక పురుగు మందుల విష ప్రభావం లేకుండా చేసే పొలంబడి ఆవశ్యకతను రైతులకు వివరించారు. మట్టి, నీరు నమూనాల సేకరణ, విత్తన ఎంపిక, మొలకల శాతం పరీక్ష, విత్తన శుద్ధి, మట్టి పరీక్ష ఆధారంగా ఎరువులు, వేపగింజల కషాయం వాడుతూ రసాయన పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలన్నారు. నారుమళ్లలో కాండం తొలచు పురుగు నివారణ, నారుకొనలు తెంచుట వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. చివరి ఆకులను తొలగించడం వల్ల ఒక నెల రోజుల పాటు ఎటువంటి పురుగు మందుల కొట్టకుండా పంటలను కాపాడుకోవచ్చని ఏవో వివరించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు ఏపీ జేఏసీ కార్యదర్శి, వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వేణుమాధవ్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర ట్రెజరీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పాము శ్రీనివాసరావు ఏపీ జేఏసీ కో చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా జిల్లా ఖజానాశాఖ కార్యాలయం వద్ద ట్రెజరీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వేణుమాధవ్ మాట్లాడారు. ఏపీ జేఏసీ కో చైర్మన్ పదవి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు దక్కడం గర్వకారణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందని అన్నారు. పెండింగ్ డీఏలు, సరెండర్ లీవు బకాయిలపై పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లపై త్వరలో ఉద్యమ కార్యాచరణకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ విజయ్‌కృష్ణ, మీసాల మాధవరావు, ఆర్.రాజేష్, సుంకర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

99 మందికి పీహెచ్‌డీలు

స్నాతకోత్సవ వేడుకల్లో భాగంగా 99 మంది రీసెర్చ్ స్కాలర్స్‌కు పీహెచ్‌డీలు, 35 మందికి బంగారు పతకాలు, ఐదుగురికి ఎండోమెంట్ అవార్డులను గవర్నర్, వీసీ ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వర్సిటీ రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఆదిత్య చైర్మన్ ఎన్.శేషారెడ్డి, ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ పి.ఉదయ్‌భాస్కర్, మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు, కేవీఎస్‌జీ మురళీకృష్ణ, శ్రీనివాస్‌కుమార్, ఈసీ సభ్యులు బీవీవీ సత్యనారాయణ, అమీనాబీ, హరిత, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్య.. విజయం



అదిరే..అదిరే : స్నాతకోత్సవంలో విద్యార్థిని సాంస్కృతిక ప్రదర్శన



స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్



గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో జేఎన్‌టీయూకే వీసీ తదితరులు...



నువ్వే సాధించావ్ తల్లి..



జేఎన్‌టీయూకే విద్యార్థులకు పట్టాభిషేకం

గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న కోట సుబ్రహ్మణ్యం

- విద్యతో దేన్నయినా సాధించవచ్చు
- క్వాంటమ్ మిషన్‌తో ఉపాధి
- గవర్నర్, వర్సిటీ కులపతి అబ్దుల్ నజీర్
- జేఎన్‌టీయూకే 11వ స్నాతకోత్సవం

జేఎన్టీయూకే, జూలై4(ఆంధ్రజ్యోతి): యువత ధైర్యంగా, విభిన్నంగా ఆలోచిస్తూ సమస్యలను ఎదుర్కొని విజయం సాధించాలని రాష్ట్ర గవర్నర్, వర్సిటీ కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. కాకినాడ జేఎన్టీయూ 11వ స్నాతకోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది.వర్సిటీలోని అలూమ్నీ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ అధ్యక్షత వహించి అధ్యక్షోపన్యాసం చేశారు. విద్య అనేది ప్రతి ఒక్కరికీ అవసరమైందని, విద్యతో ప్రపంచంలో దేన్నయినా సాధించవచ్చన్నారు. రాష్ట్రంలో ఏర్పాటవుతున్న క్వాంటమ్ మిషన్ వల్ల 2026 నాటికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయాలు క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీ, ఏఐ, ఐవోటీ, రోబోటిక్స్, నానోటెక్నాలజీ, తాత్విక ఆలోచనలతో సాంకేతికతను ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. స్వర్ణాంధ్రప్రదేశ్-2027 విజన్ ద్వారా మన రాష్ట్రం డిజిటల్ పరిపాలన, స్టార్టప్స్, తీరప్రాంతాల ఆధునికీకరణతో ప్రపంచాన్ని తలదన్నే మౌలిక సదుపాయాల కల్పనలో దూసుకువెళుతుందని చెప్పారు.ఇక్కడే చదువుకుని..అమెరికాలోని బోస్టన్ గ్రూప్ చైర్మన్‌గా ఉన్న కోట సుబ్రహ్మణ్యం (సుబు కోట)కు గవర్నర్ అబ్దుల్ నజీర్ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. అనంతరం కోట సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ స్టార్టప్స్ కోసం ఏర్పాటయ్యే ఇంక్యుబేషన్ సెల్స్ విశిష్టతను తెలిపారు. భారతదేశంలో ప్రతీ ఏడాది 25 లక్షల మంది గ్రాడ్యుయేట్లు, 3.5 లక్షల మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు డిగ్రీ పట్టాలతో బయటకు వస్తున్నారన్నారు. చైనాతో పోలిస్తే భారత్‌లో గ్రాడ్యుయేట్లు 1.5 రెట్లు ఎక్కువని, అమెరికాతో పోలిస్తే 2 రెట్లు ఎక్కువని తెలిపారు. భారతదేశంలో విద్యా నాణ్యత ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. సీఎస్ఈలో భారత్‌లో ప్రతి ఏడాది సుమారుగా 25 మంది మాత్రమే పీహెచ్‌డీలు అందుకుంటున్నారని, అమెరికాలో ఏడాదికి 800 మంది కంటే ఎక్కువగా ఉన్నారని తెలిపారు. జేఎన్టీయూకే ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ పరిశోధన కోసం నూతన కోణాలను అవలంబించాలని, సమాజశ్రేయస్సు కోసం పరిశోధనా ప్రాజెక్టులను చేపట్టాలని విద్యార్థులకు సూచించారు. పరిశ్రమ, విశ్వవిద్యాలయాలకు అనుసంధానంగా పాఠ్యాంశాలు, కోర్సు రూపకల్పనలతో పాటు పరిశ్రమల్లో పరిశోధనలను జాతీయ విద్యావిధానం ప్రోత్సహిస్తుందన్నారు. తర్వాత గవర్నర్ అబ్దుల్‌నజీర్‌ను వీసీ సత్కరించారు. వర్సిటీ రెక్టార్ కేవీ రమణ స్నాతకోత్సవానికి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వర్సిటీ రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, రాజ్ భవన్ అధికారులు, ఆదిత్య చైర్మన్ ఎన్.శేషారెడ్డి, ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ పి.ఉదయ్‌భాస్కర్, మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు, కేవీఎస్‌జీ మురళీకృష్ణ, శ్రీనివాస్‌కుమార్, ఈసీ సభ్యులు బీవీవీ సత్యనారాయణ, అమీనాబీ, హరిత, రత్నకుమారి, డైరెక్టర్లు గోపాలకృష్ణ, బీటీకృష్ణ, కృష్ణప్రసాద్, పద్మజారాణి, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, శ్యామ్‌కుమార్, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆకాశమే హద్దు : జేఎన్‌టీయూకే స్నాతకోత్సవంలో భాగంగా పట్టాలు అందుకున్న అనంతరం విద్యార్థుల ఆనందం

డీఎస్‌వోగా పార్వతి



రాజమహేంద్రవరం అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లా పౌరసరఫరాల అధికారిణిగా వి.పార్వతి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. మచిలీపట్నం డీఎస్‌వో కార్యాలయంలో సహాయ పౌరసరఫరాల అధికారిగా పనిచేస్తున్న పార్వతి పదోన్నతిపై జిల్లాకు బదిలీ అయ్యారు. ఈమేరకు కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్నరాముడులను కలిసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అధికారులు

పీ4పై సీఎం సమీక్ష

రాజమహేంద్రవరం సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : దిగువ స్థాయిలో ఉన్న కుటుంబాలకు పురోగతి పీ4 లక్ష్యమని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రభుత్వ ప్రైవేట్ ప్రజల భాగస్వామ్యం (పీ4) కార్యక్రమంపై సీఎం నారా చంద్రబాబు నాయుడు జిల్లా అధికారులతో శుక్రవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ ప్రశాంతి జిల్లా ప్రగతిని సీఎంకు వివరించారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. పీ4 కార్యక్రమంలో మండలాల వారీగా గ్రామాల్లో 10 శాతం మార్గదర్శకులను దిగువ స్థాయిలో ఉన్న 20 శాతం బంగారు కుటుంబాలను ఎంపిక చేసుకుని వారికి పీ4 ముఖ్యోద్దేశం వివరించాలన్నారు. ఈ సమీక్షలో జేసీ ఎస్.చిన్నరాముడు, డీఆర్‌వో టి.సీతారామమూర్తి, సీపీవో అప్పల కొండ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం.. బాలిక మృతి 8



విద్యుత్ శాఖ నిర్లక్ష్యం.. కొవ్వూరుకు చెందిన బాలిక నిండు ప్రాణాలు తీసింది.. చాలా కాలంగా కిందకు వేలాడుతున్న విద్యుత్ వైరు తొలగించమని కోరినా.. నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బాలిక విద్యుదాఘాతానికి గురై మృతిచెందిందని బంధువులు ఆందోళనకు దిగారు..

పక్కాగా.. స్కెచ్!



ఒక సర్వేయర్ గలీజు పని!

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

గనులశాఖలో చిన్న తరహా ఖనిజాలు దక్కించుకునేందుకు ఉమ్మడి జిల్లాలో నెలకొన్న భారీ పోటీ ఆ సర్వేయర్‌కు లక్షల్లో కాసుల వర్షం కురిపించింది. ఫస్ట్ కం ఫస్ట్ విధానంలో ముందుగా మైనింగ్‌కు దరఖాస్తు చేసుకున్నవారికే లీజు దక్కనుండడంతో సదరు ఉద్యోగి ఇదే అదనుగా స్కెచ్‌లకు బేరం పెట్టేశాడు. దరఖాస్తుకు తోడు మైనింగ్ స్కెచ్ పక్కాగా ఉంటేనే లీజు దక్కనుండడాన్ని అసరాగా చేసుకుని భారీగా పిండేశాడు. ఉచితంగా ఇవ్వాల్సిన మైనింగ్ స్కెచ్‌లకు హెక్టారుకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేశాడు. ఇలా మూడు రోజుల వ్యవధిలో సదరు సర్వేయర్ అర కోటికిపైగానే జేబులో వేసేసుకున్నాడు.ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మైనింగ్ లీజులకు 53 దరఖాస్తులు రాగా 45 ఒక్క రౌతులపూడిలో క్వారీలకే వచ్చాయి. ఇందులో సదరు సర్వేయర్ తనకు భారీగా ముట్టజెప్పిన రెండు కంపెనీలకు 15 దరఖాస్తులు దఖలు చేయించడం విశేషం.

తొలుత వచ్చిన వారికే..

గత వైసీపీ హయాంలో కుదేలైన మైనింగ్ రంగానికి పునర్జీవం కల్పించేలా ఈ ఏప్రిల్‌లో రాష్ట్ర ప్రభుత్వం మినరల్ పాలసీ-2025 తెచ్చింది. ఖనిజ నిబంధనలు సవరిస్తూ కిందటి గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం మైనింగ్ లీజులకు ఎవరు ముందు దరఖాస్తు చేసుకుంటే వారికే గనులు కేటాయించేలా ప్రభుత్వం నిర్ణయించింది. ఫస్ట్ కం ఫస్ట్ అప్లికేషన్ విధానం అమల్లోకి తెచ్చింది.ఈ నేపథ్యంలో గత నెల 30 నుంచి ఈ నెల 12 తేదీల్లో అనేక మంది మైనింగ్ వ్యాపారులు క్వారీల్లో నల్లరాయికి పోటీ పడ్డారు. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోటీ తీవ్రంగా నెలకొంది. మైనింగ్ స్కెచ్ పక్కాగా ఉంటేనే లీజు మంజూరవు తుంది. గనులశాఖ ఈ స్కెచ్‌లను దరఖాస్తుదారులకు ఉచితంగా ఇవ్వాలి.ఎందు కంటే లీజు దారుడు దరఖాస్తు సమయంలోనే హెక్టారు మైనింగ్ తవ్వకానికి రూ.80 వేలు చొప్పున చెల్లిస్తాడు.రూ.5 వేలు సర్వే ఫీజు కట్టాలి.

రౌతులపూడికే డిమాండ్..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 53 మైనింగ్ దరఖాస్తులు ఆన్‌లైన్‌లో రాగా ఇందులో 45 దరఖాస్తులు ఒక్క రౌతులపూడిలోని నల్లరాతి క్వారీలకే దాఖలయ్యాయి. మిగిలినవి పెద్దాపురం గ్రావెల్, జెడ్.అన్నవరం, వాలుతిమ్మాపురం ప్రాంతాలకు దాఖలయ్యాయి. రౌతులపూడిలోని వందల హెక్టార్లలో క్వారీలకు 45 దరఖాస్తులు పడ్డాయి.

- వ్యాపారుల మధ్య తీవ్ర పోటీ
- మైనింగ్ స్కెచ్‌ల విక్రయం
- రూ.3 లక్షల చొప్పున వసూలు
- అరకోటికిపైగా గుంజుడు
- లక్షల్లో ముట్టజెబితే స్కెచ్‌లు
- మిగిలినవారికి జెల్ల
- 53 దరఖాస్తులు
- ఒక్క రౌతులపూడికే 45

పక్కాగా స్కెచ్‌వేసి కొట్టేశాడు..

ఉమ్మడి జిల్లాలో కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోని గనుల శాఖ కార్యాలయాల్లో సర్వేయర్ల వద్ద మైనింగ్ స్కెచ్‌లు అందుబాటులో ఉంటాయి. లీజుదారులు వీటిని దక్కించు కునేందుకు ప్రయత్నించారు. అయితే ఖనిజ నిబంధనలు విడుదలవడానికి కొన్ని రోజుల ముందే తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గనుల శాఖ సర్వేయర్ వీటిపై కన్నేశాడు. ఈయన పదిహేనేళ్ల నుంచీ ఇక్కడే పాతుకు పోయాడు. కాకినాడ సర్వేయరేమో జూనియర్. కాకినాడ కార్యాలయంలో ఉన్న స్కెచ్‌లన్నీ అవసరం పేరుతో సదరు రాజమహేంద్రవరం గనులశాఖ సర్వేయర్ ముందే రప్పించేశాడు. గనులశాఖ అనుమతించిన ప్రైవేటు సర్వేయర్ల వద్ద స్కెచ్‌లను పరిశీలన పేరుతో ముందుగానే రప్పించుకున్నాడు.ఆ తర్వాత ఇక్కడి నుంచే కథ నడిపాడు. స్కెచ్‌లను హెక్టారుకు రూ.3 లక్షల వరకు సదరు సర్వేయర్ విక్రయించాడు. కొందరు వ్యాపారులు 5, 10, 15 హెక్టార్లకు అప్లికేషన్లు దాఖలు చేయగా ఈ పెద్ద స్కెచ్‌లకు రూ.10 లక్షల వరకు డబ్బులు గుంజేశాడు. రౌతులపూడి క్వారీలకు డిమాండ్ ఉండడంతో సుమారు 60 క్వారీల స్కెచ్‌లు తన వద్దే ఉంచుకున్నాడు. స్కెచ్ ఉన్న దరఖాస్తుదారుడికి లీజు అవకాశాలు పుష్కలంగా ఉండడంతో అనేక మంది వ్యాపారులు వీటిని సదరు సర్వేయర్ వద్ద కొనుగోలు చేశారు.రవి అనే వ్యాపారి సత్య ఇంజనీరింగ్ పేరుతో పలు పేర్లు మార్చి ఏడు దరఖాస్తులు దాఖలు చేశారు.ఈ మైనింగ్ ప్రాంతం స్కెచ్‌లన్నీ ఈయన ముందే కొనేశాడు. సదరు సర్వేయర్ అడ్డంగా సహకరించాడు. రౌతులపూడి క్వారీకి సంబంధించి దాదాపు 28 మంది వ్యాపారులు లక్షలకు లక్షలు సర్వేయరుకు ముట్టజెప్పారు. మెట్ట ప్రాంతానికి చెందిన ఓ కాంట్రాక్టర్ కంపెనీ ఆరు దరఖాస్తులు చేయగా స్కెచ్‌లకు భారీగా ముట్టజెప్పింది. సదరు ఉద్యోగి మూడు రోజుల వ్యవధిలో అర కోటిపైనే జేబు నింపేసుకున్నాడు. కాకినాడ సర్వేయర్ జూనియర్ కావడం రాజమహేంద్రవరం ఏడీ కార్యాలయ సర్వేయర్‌కు బాగా కలిసొచ్చింది.

ఇక్కడా వైసీపీ నేతలే..!

అప్లికేషన్ ఆన్‌లైన్‌లో దా ఖలు చేయడానికి సమయం పట్టడం, కొత్త వ్యాపారులకు అవగాహన లేకపోవడంతో సదరు సర్వేయర్ ఏకంగా ఎనిమిది మందిని పురమాయించి రాజమహేంద్రవరంలో ఓ అపార్ట్‌మెంట్ నుంచి వంద హెక్టార్ల మైనింగ్ కోసం వ్యాపారుల తరపున 15 లీజు దరఖాస్తులు చేయించారు.కాకినాడ గనుల శాఖలో అవుట్‌సోర్సింగ్ మాజీ మహిళా ఉద్యోగి సైతం కొందరు వ్యాపారుల తరపున దరఖాస్తులు దాఖలు చేశారు.ఇదిలా ఉంటే వచ్చిన దరఖాస్తులను సోమవారం నుంచి పరిశీలించి ఎవరు ముందుగా లీజులకు దరఖాస్తు చేశారు? స్కెచ్‌లు ఎవరివి పక్కాగా ఉన్నాయో నిర్ధారించి లీజులు ఖరారు చేయనున్నారు.దరఖాస్తుల్లో అనేక మంది వైసీపీ వ్యాపారులు ఉండడంతో లీజుల కోసం వీరు సైతం చక్రం తిప్పుతున్నారు.



అమల్లోకి మైనింగ్ కొత్త పాలసీ

14 వరకే సీనరేజి కాంట్రాక్టు గడువు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం మైనర్ మినరల్ పాలసీ, ఇసుక ఉచిత విధానంతో కొత్త మైనింగ్ పాలసీని అమల్లోకి తెచ్చింది. ఈ మేరకు గత నెల 26వ తేదీనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గెజిట్‌లో నోటిఫికేషన్ విడుదల చేశారు. దీంతో జిల్లాలో చాలా కాలం తర్వాత మైనింగ్ సందడి మొదలైంది. మాన్యువల్‌గానే ఇసుక తీయాలని కొత్త పాలసీలో ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం డీసిల్టేషన్‌కే అనుమతి ఉందని.. ఓపెన్ రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. గత వైసీపీ పాలనలో మైనింగ్ విధానం ధ్వంసమైన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఏప్రిల్ 29న కొత్తపాలసీపై ప్రభుత్వం ఓ సర్క్యులర్ జారీ చేసిన సంగతి తెలిసిందే. దానిని అధికారికంగా అమల్లోకి తెచ్చారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బిల్డింగ్,రోడ్ మెటల్, గ్రానైట్,గ్రావెల్, లేటరైట్ గనులు ఉన్నాయి. అప్పట్లో 250 లీజు దరఖాస్తులను వైసీపీ పెండింగ్‌లో పెట్టింది. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వాటిని పరిశీలించి అర్హులకు లీజు ఇవ్వనుంది. కొత్త దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ముందు పాతవి క్లియర్ చేయనున్నారు. ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ) ప్రకారం 2023 మార్చి 13 నాటికి ఫైలైన పెండింగ్ మినరల్ కన్సెషన్ దరఖాస్తులు పరిశీలించి పరిష్కరించనున్నారు. అర్హత ఉంటే ఆమోదం తెలిపి డిపాజిట్ కట్టించుకుంటారు.గ్రానైట్, మార్బుల్, బిల్డింగ్ మెటీరియల్‌కు తాజాగా దరఖాస్తు చేసుకోవాలి. ఇండస్ట్రియల్ మినరల్ కోసం వేలం పద్ధతి ఉంటుంది. దరఖాస్తులన్నీ ఆన్‌లైన్‌లో జరుగుతాయి. రోడ్ మెటల్ హెక్టారుకు రూ.80 వేలు, గ్రావెల్‌కు రూ. 65 వేలు, గ్రానైట్‌కు రూ. లక్షా 85 వేల వరకూ డిపాజిట్ చేయవలసి ఉంది.

14 వరకూ సీనరేజి కాంట్రాక్టు

సీనరేజి కాంట్రాక్టు గడువు ఈ నెల 14వ తేదీ తేదీ వరకూ ఉంది. గతంలో మైనింగ్ అధికారులే సీనరేజి వసూలు చేసేవారు.కానీ వైసీపీ ప్రైవేట్ కాం ట్రాక్టరుతో ముందుగానే డిపాజిట్ కట్టించు కుని సీనరేజీ వసూళ్లను అప్పగించింది.ఇది చాలా మందికి ఇబ్బంది కరంగా మారింది.మరి ప్రభుత్వం ఈ నెల 14వ తేదీ తర్వాత ఏం చేస్తుందో చూడాలి.

మూగనోము వీడిన పోలీస్

- 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదలిక
- ప్రత్యేక దృష్టి పెట్టిన ఎస్పీ
- గేదెల దొంగలపై నిఘా

రాజానగరం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : గేదెల దొంగతనాలపై ఎట్టకేలకు పోలీసులు కదిలారు.ఆంధ్రజ్యోతిలో శుక్రవారం 'పోలీసుల మూగనోము' శీర్షికతో వెలువడిన కథనంపై స్పందించారు. జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ నేరుగా రంగంలోకి దిగారు. ఎస్పీ ఆదేశాల మేరకు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు శుక్రవారం చక్రద్వారబంధం గ్రామానికి చేరుకుని బాధిత పాడి రైతులు, యజమానులను కలిసి వివరాలు సేకరించే చర్యలకు ఉపక్రమించారు. రాజానగరం మండలంలో గత కొన్నేళ్లుగా పాడి పశువుల వరుస దొంగతనాలపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో బాధిత రైతులు, యజమానులు ఆంధ్రజ్యోతిని ఆశ్రయించిన విషయం విదితమే. పత్రికలో వచ్చిన విధంగా స్పెషల్ బ్రాంచ్ పోలీసులు బాధిత యజమానులు, రైతులను స్వయంగా కలిసి ఎప్పుడు జరిగింది, ఎలా జరిగింది, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారా? ఎఫ్ఐఆర్ నమోదు చేశారా? చేస్తే రశీదు ఇచ్చారా లేదా అనే వివరాలను సేకరించారు. పశువుల దొంగతనాలపై గత కొన్నేళ్లుగా రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఆంధ్రజ్యోతిని ఆశ్రయించినట్టు రైతులు తెలిపారు. పశువుల దొంగతనాలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ రాజానగరం పోలీసులకు ఆదేశాలిచ్చారు.

దమ్మెన్ను పంచాయతీలో వైసీపీ లొల్లి

నేటి తరానికి ఆదర్శం అల్లూరి 8

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె

మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె నోటీసు

కొవ్వూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులు హెచ్చరించారు. కొవ్వూరు మునిసిపల్ కమిషనర్ (ఎఫ్ఏసీ) సందీప్‌కు శుక్రవారం ముందస్తుగా సమ్మె నోటీసు అందజేశారు.ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ముఖ్య సలహాదారుడు పెదపాటి గురునాథ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీల్లో అత్య వసర విభాగాలైన ఇంజనీరింగ్, నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, డేటాఎంట్రీ ఆపరేటర్లు, వర్కు ఇన్‌స్పెక్టర్లకు నెలసరి వేతనం రూ.29,200లు ఇంజనీరింగ్ డ్రైవర్లు, క్యాబ్‌డ్రైవర్లకు రూ.24,500ల వేతనాలు పెంపుదల చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఔట్ సోర్సింగ్ కార్మికులకు అర్హత కల్పించాలని డిమాండు చేశారు. ఈ నెల 15వ తేదీలోగా సమస్యలు పరిష్కరించకపోతే నేరుగా సమ్మెలోకి దిగుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రాజాన అప్పారావు,సీఐటీయూ నాయకులు ఎం.సుందర బాబు, ఎం.కిశోర్, నాగేశ్వరరావు, సోములు తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు కమిషనర్ సందీప్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

'పంటల బీమా నమోదు చేయించండి'

రాజమహేంద్రవరం రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పంటల బీమా నమోదు చేసు కోవాలని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూరికార్డుల ఏకీకరణతో నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ లో నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలో సార్వా 2025 పంటల బీమా క్రింద నోటిఫై చేసిన ప్రీమియం వరి రూ.570 ఆగస్టు 15 లోగా, మినములు రూ.300 జూలై 15వ తేదీ లోగా, అరటి రూ.3 వేలు జూలై 15వ తేదీలోగా చెల్లించాలన్నారు. రుణం పొందిన రైతులకు బ్యాంకు ద్వారా పంటల బీమా నమోదవుతుందన్నారు. రుణం పొందని రైతులు కామన్ సర్వీస్ సెంటరుకు వెళ్లి నమోదు చేయిం చుకోవాలన్నారు.కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం పంటల బీమా యోజన నమోదు గోడపత్రిను కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, ఎస్‌బీఐ బ్యాం క్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



పంటల బీమా నమోదు పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, అధికారులు

మావుళ్లమ్మ ఆలయానికి స్టీల్ గేటు బహూకరణ

తాళ్లపూడి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రక్కింకలోని మావుళ్లమ్మ వారి ఆలయానికి ఆ గ్రామానికి చెందిన దూడల ఏడుకొండలు దంపతులు శుక్రవారం స్టీల్ గేటును బహూకరించారు. గ్రామదేవత ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారంగా గేటును అందజేశానని ఆయన తెలిపారు. దాత కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగా


కొవ్వూరు : మోహనరంగా విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కాపు సంఘం నాయకులు


దేవరపల్లి: రంగా విగ్రహానికి నివాళి అర్పిస్తున్న జనసేన నేత సువర్ణరాజు


నిడదవోలులో: నివాళి అర్పిస్తున్న కాపు నాడు సంఘ ప్రతినిధులు

కొవ్వూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పేదల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగా అని పట్టణ కాపు సంఘం నాయకుడు నగళ్లపాటి శ్రీనివాస్ అన్నారు. మోహనరంగా 78వ జయంతిని పురస్కరించుకుని కొవ్వూరు మెరకవీధి, వాటర్‌ట్యాంకు వద్ద రంగా విగ్రహానికి రంగా యూత్ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నగళ్లపాటి శ్రీనివాస్, అడ్డూరి సుబ్బారావు, యాళ్ల నరసింహరావు, డేగల రాము, ఆవుల వాసు, ఘంటా చిరంజీవి, గంగ్రోతు శివరామకృష్ణ, కళ్లేపల్లి శ్రీను, ప్రభాత్, మాణికిరెడ్డి హరిబాబు, గడదాసి శివ, జొన్నల రాంబాబు, జాకీ, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: బడుగు, బలహీన వర్గాల కోసం వంగవీటి మోహనరంగా ఎంతో కృషి చేశారని గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి సువర్ణరాజు పేర్కొన్నారు. దేవరపల్లిలో మోహన రంగా జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కంబాల సత్తిబాబు, పసుపులేటి శివనాగప్రసాద్, మాధ వరపు వెంకటేశ్వరరావు, సూరిశెట్టి బాలు, దాసరి శేషారావు, అనిశెట్టి గంగరాజు, కవల సీతారత్నసూర్యకుమారి, తదితరులు పాల్గొన్నారు. మోహనరంగా చిన్నవయసులోనే పేదలకు ఎన్నో సేవలందించారని ఎంపీపీ కేవీకే దుర్గారావు పేర్కొన్నారు. దేవరపల్లిలోని మూడు బొమ్మల సెంటర్ వద్ద ఉన్న వంగవీటి విగ్రహానికి ఎంపీపీ, కాపుసంఘ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వంగా జయంతి సందర్భంగా కేకు కట్ చేశారు. కార్యక్రమంలో కాపు సంఘం నేతలు, వైసీపీ నాయకులు కవల శ్రీనివాస్, కామిశెట్టి దుర్గారావు, దుగ్గిన గంగాధరరావు, పచ్చా రామ్ గోపాల్, కడిమి రాజు, తదితరులు పాల్గొన్నారు.

కొనియాడిన పలువురు వక్తలు

ఉండ్రాజవరం: మండలంలోని చివటం, తాడిపర్రు, తదతర గ్రామాల్లో వంగవీటి మోహన్ రంగా జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో అరిగెల మల్లిఖార్జున రావు, దుర్గా ప్రసాద్, జవ్వాది వినయ్, వాకలపూడి సత్యనారాయణ, అక్కిన గోపాలకృష్ణ, వెలిగట్ల రాముడు, తదితరులు పాల్గొన్నారు.


గుడ్డిగూడెంలో మోహనరంగా విగ్రహానికి పూలమాల వేస్తున్న జనసేన నేత సువర్ణరాజు

నిడదవోలు: నిడదవోలు పట్టణంలోని కాపుల వీధిలో ఉన్న వంగవీటి మోహనరంగా విగ్రహం వద్ద మోహనరంగా 78వ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి వంగవీటి మోహనరంగా చేసిన కృషిని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో వంగా నాగేశ్వరరావు, గంటా శ్రీనివాసరావు, సత్తిబాబు, గూడా ఆదినారాయణ, శివ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: అన్నదేవరపేటలో వంగవీటి మోహన రంగా జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేణ్ని సోమరాజు, మేణ్ని సతీష్, కుమార్, శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: వంగవీటి మోహనరంగా ఎప్పటికీ పేదల పెన్నిధిగా గుర్తుంటారని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు అన్నారు. గుడ్డిగూడెంలో మోహనరంగా జయంతిని శుక్రవారం నిర్వహించారు. రంగా విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం జనసేన కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. దీనిలో భాగంగా పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో జనసైనికులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్య వర్ధంతి


పింగళి వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

తాళ్లపూడి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య వర్ధంతిని పైడిమెట్టలోని మండల పరిషత్ పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం డీ. దుర్గారావు మాట్లాడుతూ పింగళి స్వాతంత్ర సమర యోధుడు అని, దేశానికి జాతీయ జెండా రూపొందించారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధర్మాన రాము, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు: స్వాతంత్ర్య పోరాటంలో మన కంటూ జెండా ఉండాలని సర్వమతాల సమానత్వంతో తిరంగ జెండాను రూపకల్పన చేసిన పింగళి వెంకయ్యకు భారతరత్న ఇచ్చి గౌరవించాలని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాష్ డిమాండ్ చేశారు. శుక్రవారం పింగళి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు.

డ్రమ్ సీడర్ విధానంతో రైతుకు ఎంతో మేలు

పెరవలి, జూలై4 (ఆంధ్రజ్యోతి): డ్రమ్ సీడర్ విధానంతో రైతుకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ రామకృష్ణ అన్నారు. ముక్కామలలో తొలకరి సాగులో భాగంగా 10 కేజీల విత్తనాలను ఎకరా పొలంలో డ్రమ్ సీడర్‌తో విధానంలో కన్నాజీ వెంకట కృష్ణ వ్యవసాయ క్షేత్రంలో వేశారు.

'అల్లూరి'ని ఆదర్శంగా తీసుకోవాలి


అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి


నిడదవోలులో అల్లూరి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

కొవ్వూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని దేశ ప్రయోజనాలకోసం పాటుపడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. అల్లూరి 128వ జయంతిని పట్టణంలోని ఆయన విగ్రహం వద్ద గోదావరిమాత క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి విగ్రహానికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, నాగేంద్ర పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం నాగేంద్ర మాట్లాడుతూ ఆనాటి కాలంలో బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించారన్నారు. కార్యక్రమంలో నంద్యాల రామకృష్ణంరాజు, ముదునూరి సూర్యనారాయణరాజు, కంటమణి కిషోర్, సీహెచ్ సాయిరాజు, పెరుగు పోతురాజు, కూటమి నాయకులు, క్షత్రియ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు గొప్ప పోరాట యోధుడని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పేర్కొన్నారు. శుక్రవారం దేవరపల్లిలో మెరకవీధి రామాలయం వద్ద, జడ్పీ హైస్కూల్‌లో ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక క్షత్రియ సంఘం ఆర్ఆర్ యూత్ ఆధ్వర్యంలోనూ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దిపాటి మాట్లాడుతూ అల్లూరి పోరాట యోధునిగా పేరు తెచ్చుకున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్ఆర్ యూత్ అధ్యక్షుడు కరిసేటి రామచంద్రరాజు, మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు సుంకర దుర్గారావు, టీడీపీ నాయకులు ఓరుగంటి లక్ష్మీపతిరాజు, కరుటూరి శ్రీనివాస్, కాత్రు భీమరాజు, కొండపల్లి దొరయ్య, యాగంటి సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అల్లూరి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఎంపీపీ కేవీకే దుర్గారావు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ వై.రాజారావు, పంచాయతీ వార్డుసభ్యుడు పచ్చా రామ్‌గోపాల్, మండల పార్టీ సూపరింటెండెంట్ శాంతి కుసుమ, కామిశెట్టి దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని పలు గ్రామాల్లో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వెలగదుర్రులో క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముదునూరి రవీంద్రరాజు, ఎం. నారాయణరాజు, ఇందుకూరి కేశవరాజు, రామకృష్ణంరాజు, శ్రీనివాసరాజు, ధనిశెట్టి ఉమామహేశ్వరరావు, వేదుల శ్రీనివాసులు, మునియ్య, శివ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వీట్స్ పంచారు. చిలకపాడు, వడ్లూరు, సత్యవాడ గ్రామాల్లోనూ వేడుకలు నిర్వహించారు.

నిడదవోలు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో చూపిన తెగువ, ధైర్య సాహసాలు అత్యంత ఆదర్శనీయమని ప్రజా సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు కొనియాడారు. శుక్రవారం పట్టణంలోని గాంధీనగర్‌లో అల్లూరి విగ్రహం వద్ద 128వ జయంతిని పురస్కరించుకుని పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ బూరుగుపల్లి అప్పారావు, డాక్టర్ సూర్యనారాయణ రాజు, సత్యనారాయణరాజు, సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు, పొన్నా కృష్ణబాబు, సూర్యకాంతం, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తహశీల్దార్ అజయ్‌బాబు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అల్లూరి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, ఆర్ఐ సునీత, రెవిన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

6న పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీరేబిస్ వ్యాక్సిన్ల పంపిణీ

కొవ్వూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని 6వ తేదీన కుక్కలకు యాంటీరేబిస్ వ్యాక్సిన్లను ఉచితంగా అందజేస్తున్నట్టు కొవ్వూరు ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ ఏ. వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను జూనోటిక్ వ్యాధి అంటారన్నారు. అలాగే రేబీస్, బ్రూసిల్లోసిస్, లెప్టోస్పైరోసిస్, ఆంత్రాక్స్ వంటి వ్యాధుల నుంచి రక్షించుకోవడానికి లూయిస్‌పాశ్చర్ యాంటీరేబీస్ వ్యాక్సిన్‌ను కనుగొనడం జరిగిందన్నారు.

గ్రామాల్లో 'సుపరిపాలన - తొలి అడుగు'


అనంతపల్లిలో ఇంటింటికీ పథకాల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే మద్దిపాటి

నల్లజర్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల మన్ననలతోనే కూటమి ప్రభుత్వం నడుస్తోందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. సుపరిపాలనలో భాగంగా తొలి అడుగు కార్యక్రమాన్ని శుక్రవారం అనంతపల్లి, నబీపేట, కవులూరులో నిర్వహించారు. అనంతరం వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా అనంతపల్లిలో మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మద్దిపాటి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ కొఠారు అనంతలక్ష్మి, అనంతపల్లి గ్రామ టీడీపీ అధ్యక్షుడు విప్పిలి శ్రీనివాసరావు, విప్పిలి వీరరాఘవులు, రాజా బ్రదర్స్, కెంగం శ్రీను, వల్లిరెడ్డి సతీష్, చీపురుగూడెం పార్టీ అధ్యక్షుడు చెల్లు పెద్దరామన్న, బేతిన సత్యనారాయణ, కాశీ, కూచిపూడి ఉదయ భాస్కరరావు, గన్నమనేని వెంకటేశ్వరరావు, బేతిన దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: తాడిపూడిలో స్థానిక టీడీపీ నేత నామా కొండబాబు అధ్యక్షతన శుక్రవారం సుపరిపాలన - తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ముందుగా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తైన సందర్భంగా సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు డోర్ టు డోర్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, నామా నరేంద్ర (నాని), చెన్నా సత్యనారాయణ, సిద్ధన రాధాకృష్ణ, యండపల్లి శేఖర్, అనపర్తి ప్రసాద్, చెవ్వూరు బంగార్రాజు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, తదితర కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే ప్రక్కిలంకలోనూ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కిప్పాక కోటేశ్వర్, నాయుడు హనుమంతరావు, కందుల నాగు, తదితర కూటమి నేతలు పాల్గొన్నారు.

రోశయ్యకు ఘన నివాళి


రోశయ్య విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్యులు

కొవ్వూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): స్వర్గీయ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అపరచాణిక్యుడని కొవ్వూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మట్టే ప్రసాద్ అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద శుక్రవారం రోశయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కె.శ్రీనివాస్, వి.శివరామకృష్ణ, ఎన్.శ్రీనివాస రావు, టి.నాగరమేష్, కె.సోమయ్య, ఎం. వీరభద్రగుప్తా, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: అసెంబ్లీలో 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత మాజీ సీఎం కొణిజేటి రోశయ్యకే దక్కుతుందని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేడవరపు భద్రం దొర అన్నారు. శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద రోశయ్య జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోశయ్య రాజకీయాల్లో ఏ మచ్చాలేని స్వచ్ఛమైన నాయకుడన్నారు. చిన్నం మురళికృష్ణ, అగర్వాల హీరాలాల్, భావన రమేష్, జీవీవీ సత్యనారా యణ, తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌ను కలిసిన దళిత నాయకులు


రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌ను కలిసిన దళిత నాయకులు

కొవ్వూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్‌ను దళిత నాయకులు శుక్రవారం కొవ్వూరులో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ఎస్ ఫౌండర్ బుంగా సంజయ్, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్, దూది జయరాజు, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర సెక్రటరి సూరిబాబు, కె.సూరి, బీ.గంగాధర్, పవన్‌కుమార్, బీ.దత్తు, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు మోసపోవద్దు : సీఐ


శక్తియాప్‌పై అవగాహన కల్పిస్తున్న పట్టణ సీఐ విశ్వం, పక్కన ఇతరులు

కొవ్వూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో పరిచయమైన అగంతుకులను నమ్మి బాలికలు మోసపోవద్దని పట్టణ సీఐ పి.విశ్వం అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం పట్టణ పోలీసులు శక్తియాప్, పోక్సో, రోడ్ సేఫ్టీ, సైబర్‌నేరాలపై అవగాహన సదస్సును ఏర్పాటుచేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ సోషల్ మీడియా వినియోగంలో బాలికలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి యాప్‌లలో పరిచయమైన అగంతకులను నమ్మిమోసపోవద్దన్నారు. అలాగే కళాశాలకు వచ్చి, వెళ్లే సమయాలలో ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే దగ్గరలోని పోలీసులకు సమాచారం అందించాలన్నారు. బాలికల సమస్యలను గుర్తించడానికి కళాశాలలో ఐదుగురు విద్యార్థినులను ఎంపికచేసి శక్తి వారియర్స్ టీమ్‌గా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కళ్యాశాల అధ్యాపకులు, మహిళా పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలన భేష్ : ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల


చాగల్లులో కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

చాగల్లు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఎన్‌డీఏ కూటమి ప్రజలకు ఇచ్చిన హామీలను ఏడాది పాలనలో చాలా వరకు అమలు చేసినట్టు ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి అన్నారు. శుక్రవారం సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు పశివేదల రోడ్డు సెంటర్‌లో పర్యటించి ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆళ్ల హరిబాబు, కరుటూరి సతీష్, కేతా సాహెబ్, దొంగ రామకృష్ణ, తాళ్ళూరి ప్రసాద్, అల్తాఫ్ అహ్మద్, జొన్నకూటి వెంకాయమ్మ, ఈడుపుగంటి మురళి, ఈడుపుగంటి సుబ్బారావు, పాశం రామకృష్ణ, ఆళ్ల సూర్యప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

'దమ్మెన్ను'లో వైసీపీ లొల్లి

● తన పక్కన కూర్చున్నాడంటూ ఎంపీటీసీపై సర్పంచ్ ఆగ్రహం


నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపీటీసీ రామకృష్ణ

ఉండ్రాజవరం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): దమ్మెన్ను పంచాయతీ బోర్డు సమావేశంలో వైసీపీకి చెందిన సర్పంచ్, అదే పార్టీకి చెందిన ఎంపీటీసీపై ప్రవర్తించిన తీరుపై వివాదం, ఉద్రిక్తత పరిస్థితులకు దారి తీసింది. శుక్రవారం దమ్మెన్ను పంచాయతీ బోర్డు సమావేశం సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ అధ్యక్షతన జరుగుతుండగా, ఎంపీటీసీ సభ్యుడు గెడ్డ రామకృష్ణ సీటు పక్కనే వేయడంతో కూర్చున్నాడు. దీంతో సర్పంచ్ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతూ ఎంపీటీసీ రామకృష్ణ సీటు తన పక్కన వేయడానికి కుదరదని, అతను నా పక్కన లేస్తేనే సభ జరుగుతుందని, లేకపోతే నేను వెళ్లిపోతానంటూ చెప్పారు. సమావేశంలో ఉన్న టీడీపీ, జనసేన పార్టీకి సభ్యులు కలుగజేసుకుని మీ పార్టీ ఎంపీటీసీయే కదా, అతను నీలాగే ప్రజల ద్వారా ఎన్నికయ్యాడు, ప్రతిపక్షంగా మాకు లేని అభ్యంతరం మీకు ఎందుకు అని చెప్పారు. అయినప్పటికీ సర్పంచ్ వినకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితిలో ఎంపీటీసీ రామకృష్ణ బయటకు వచ్చి దళితసామాజిక వర్గానికి చెందిన తనకు జరిగిన అవమానానికి సర్పంచ్ క్షమాపణ చెప్పాలంటూ రోడ్డుపై అంబేడ్కర్ ఫొటోతో నిరసన వ్యక్తం చేశారు. దీంతో విషయం తెలుసుకున్న ఎంపీటీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు తరలివచ్చి మద్దతుగా నిలిచారు. సర్పంచ్ క్షమాపణ చెప్పాలని వారు రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తూ డిమాండ్ చేశారు. దీంతో తణుకు-రాజమండ్రి రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న తహశీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో రామారావు, పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చారు. ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణకు బహిరంగంగ క్షమాపణ చెప్పడంతో రామకృష్ణ, అతని సామాజిక వర్గ ప్రజలు శాంతించి, నిరసన విరమించారు.

ఎమ్మెల్యే గ్రీవెన్స్‌కు 12 వినతులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో 12 వినతులు స్వీకరించారు. కొత్త రేషన్‌కార్డులు, తల్లికి వందనం పథకంలో డబ్బులు పడకపోవడం,రెవెన్యూ సమస్యలు, సీసీ రోడ్లు నిర్మించాలని అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ కార్యాలయాల్లో గ్రీవెన్స్ నిర్వహించడం జరుగుతుందన్నారు. గడచిన 5 సంవత్సరాల వైసీపీ ప్రభుత్వం ప్రజల గురించి, ప్రజా సమస్యల గురించి ఎక్కడా పట్టించుకోలేదన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా, రూ. 10 లక్షల కోట్లు అప్పులు చేసి ఖజానాను ఖాళీ చేసి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, పెనుమాక జయ్యారాజు, కె.వి.కె.రంగారావు, కొప్పాక జవహర్, వేమగిరి వెంకట్రావు, కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు

ఉండ్రాజవరం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం పీహెచ్‌సీ పరిధిలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు శుక్రవారం ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. రాష్ట్రీయ బాలస్వస్తా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బేసిక్ పరీక్షలు జరిపారు. విద్యార్థులకు రక్తపరీక్షలు, ఎత్తు, బరువు, ఛాతి కొలతలు పరీక్షించారు. వీటిని తమ రికార్డుల్లో నమోదు చేసుకున్నారు. ఉండ్రాజవరం హైస్కూలులో నిర్వహించిన పరీక్షల్లో వైద్య సిబ్బంది కె. రామకృష్ణ, ఆర్. సత్యవతి, పి. విజయలక్ష్మి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం...
మెయిన్ వైర్ తగిలి బాలిక మృతి

● కొవ్వూరు మండలం ధర్మవరంలో సంఘటన
● ఆసుపత్రి ఎదుట గ్రామస్థుల ఆందోళన


సౌమ్యశ్రీ (ఫైల్‌ఫొటో)

కొవ్వూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం కారణంగా బాలిక మృతిచెందిన సంఘటన తూర్పుగోదా వరి జిల్లా కొవ్వూరు మండలం ధర్మవరంలో జరిగింది. వివరాల ప్రకారం.. ధర్మవరం కొత్తపేట జగ్జీవన్ రావు విగ్రహం సమీపంలో నివాసం ఉంటున్న జొన్నకూటి రామకృష్ణ, అరుణకుమారికి ఇద్ద రు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. గురువారం రాత్రి కురిసిన వర్షం, ఈదురుగాలులకు గ్రామంలో విద్యుత్ సరఫరా అయ్యే మెయిన్ వైరు జారి కిందకు వేలాడింది. శుక్రవారం రామకృష్ణ చిన్న కుమార్తె పాఠశాలకు వెళ్లడానికి పనులు చేసుకుంటూ ఇంటి ప్రాంగణంలో ఉన్న తాడుపై దుస్తులు ఆరేసుకుంటుంది. తాడు పైనుంచి (మనుషులకు తగిలే ఎత్తులో) విద్యుత్ మెయిన్‌వైరు వెళ్లడంతో సౌమ్యశ్రీ (15)కి విద్యుత్ షాక్ తగిలింది. ఇది గమనించిన అన్నయ్య అజయ్‌కుమార్, అతడి స్నేహితుడు కొడమంచిలి సిద్ధూ సౌమ్యశ్రీని కాపాడే ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నంలో ఇద్దరికి గాయాలయ్యాయి. సిద్ధూ స్థానికంగా చికిత్స పొందగా అజయ్‌కుమార్, సౌమ్యశ్రీని కొవ్వూరు తీసుకువెళ్లేలోపు సౌమ్యశ్రీ మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు పెద్దఎత్తున ఆసుపత్రికి చేరుకుని ఆందోళన చేపట్టారు. విద్యుత్ వైర్లు కిందకు ప్రమాదకరంగా వేలాడుతున్నాయని.. పైకి కట్టాలని పం చాయితీ అధికారులు, పాలకులకు, విద్యుత్ లైన్‌మెన్‌లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఇంకా ఎంతమంది బలైపోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అన్నివిధా లా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తల్లితండ్రుల ఫిర్యాదు మేరకు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు కేసు నమోదు చేశారు. మృతదేహానికి ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. సౌమ్య శ్రీ ధర్మవరం జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతుంది. ఈనెల3న పుట్టినరోజును చేసుకుంది. మరుసటి రోజే ఎంత దారుణం జరిగిపోయిందని బంధువులు కన్నీరు మున్నీరయ్యారు.


ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

ఆర్టీసీ ఖాళీ స్థలాలకు 8న ప్రీ బిడ్ సమావేశం

కొవ్వూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఆర్టీసీ డిపో పరిధిలోని పాత బస్టాండ్ బిట్ - 1, (198 స్క్వేర్ యార్డు), కొత్త బస్టాండ్‌లో బిట్ - 2(296 స్క్వేర్ యార్డు)లో ఖాళీగాఉన్న భూములకు ఓపెన్ స్పేస్ 15 సంవత్సరాల పథకం కింద ఈ నెల 8వ తేదీన రాజమహేంద్రవరంలోని జిల్లా ప్రజారవాణా అధికారి కార్యాలయంలో ప్రీ బిడ్ సమావేశం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. ఔత్సాహికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

మున్సిపల్ కమిషనర్ (ఎఫ్ఏసీ)గా ఏఈ సందీప్ బాధ్యతలు

కొవ్వూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌గా ఏఈ జి. సందీప్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీరుగా పనిచేస్తున్న సందీప్‌ను కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ వడ్డేశ్వరం సీడీఎంఏ నుంచి శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ మేరకు శుక్రవారం కమిషనర్ (ఎఫ్ఏసీగా) బాధ్యతలు స్వీకరించారు.

నట్టల నివారణ టీకాలు


మీనానగరంలో జీవాలకు నట్టల నివారణ టీకాలు వేస్తున్న దృశ్యం

చాగల్లు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మార్కొండపాడు, దారవరం, మీనానగరంలో గురు, శుక్రవారాల్లో జీవాలకు నట్టల నివారణ, వ్యాధి నివారణ టీకాలు వేశారు. చాగల్లు పశువైద్యశాల వారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కొవ్వూరు డివిజన్ ఉపసంచాలకుడు కే .సత్యనారాయణ, సహాయ సంచాలకుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్, పశువైద్యాధికారి యు. ముఖేష్ పాల్గొని వైద్యసేవలందించారు. కార్యక్రమంలో 1800 గొర్రెలు, 250 మేకలకు ఉచితంగా మందులు వేశారు.. జీవాల రైతు సంఘం నాయకులు నక్కా జయరాజు, పట్టపగలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.